
# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

7


# కృష్ణా జిల్లా వార్తలు

శుక్రవారం 7 మార్చి 2025

# వనజాక్షి.. ఇదేం పని?

## 220 కేవీ అలైన్‌మెంట్ మాయ



పెదపారుపూడి మండలం ఈదులమద్దాలి గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుత్ టవర్

## తహసీల్దార్ వనజాక్షి భర్త, బంధువుల భూములను తప్పించటానికి ట్రాన్స్‌కోపై ఒత్తిడి

### కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో అలైన్‌మెంట్ మార్పు

- 33 ఎకరాల వనజాక్షి భర్త, బంధువుల భూముల నుంచి లైన్ వెళ్లకుండా మార్పు
- సామాన్య రైతుల భూముల్లోకి అలైన్‌మెంట్ మారటంతో కోర్టుకెళ్లిన రైతులు
- ప్రభుత్వం విచారణకు ఆదేశించాలని గుడివాడ ప్రజల వినతి

"దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అక్రమంగా ఇసుక తవ్వుతుంటే అడ్డుకున్నందుకు తనపై దాడి చేశారని నానాయాగీ చేసిన తహసీల్దార్ వనజాక్షి.. వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని తమ భూములను రక్షించుకునేందుకు పేదల భూములను ఎరగా వేశారు. పేదల భూములు అయితే ఒక న్యాయం.. రెవెన్యూ అధికారులు, వారి బంధువులు అయితే మరో న్యాయం అన్నట్టుగా వనజాక్షి భర్త, వారి బంధువుల భూములను గుడివాడ-మెరకగూడెం 220 కేవీ ట్రాన్స్‌మిషన్ హైటెన్షన్ టవర్ లైన్ అలైన్‌మెంట్ నుంచి అడ్డగోలుగా తప్పించేశారు. ఈ క్రమంలో తమకు అన్యాయం జరిగిందని రైతులు కోర్టును ఆశ్రయించారు. భూములను తప్పించిన విషయం బయట పడుతుందని ట్రాన్స్‌కో అధికారులు కోర్టుకు సమాచారం ఇవ్వట్లేదు. కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న ఈ అలైన్‌మెంట్ మాయ కారణంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎందరో రైతులు నష్టపోవాల్సి వస్తోంది."

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గుడివాడ ప్రాంత ప్రజల విద్యుత్ కష్టాలను తీర్చటానికి వీలుగా యలమర్రు వద్ద 400/220/132 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు రూ.19 కోట్ల నిధులు కేటాయించారు. దీంతో పాటు యలమర్రులోనే 69.03 ఎకరాల భూములను కూడా సబ్‌స్టేషన్‌కు కేటాయించారు. అప్పట్లో పనులు ప్రారంభించినా వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పర్యవేక్షణ లేక పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పటికి కూడా పూర్తికాలేదు. ఈ సబ్‌స్టేషన్‌కు గుడివాడ నుంచి జంక్షన్ వెళ్లే ప్రాంతం మెరకగూడెం సబ్‌స్టేషన్ వరకు 220 కేవీ ట్రాన్స్‌మిషన్ విద్యుత్ హైటెన్షన్ లైన్లను వేయాల్సి ఉంది. ఇందులో నిర్దేశించిన అలైన్‌మెంట్ ప్రకారం పెదపారుపూడిలో ఏడు కిలోమీటర్ల మేర అలైన్‌మెంట్‌ను మార్చారు. నిర్దేశిత అలైన్‌మెంట్ కంటే కూడా 340 అడుగుల తేడాతో అలైన్‌మెంట్‌ను మార్చటం జరిగింది. ఈ ఏడు కిలోమీటర్ల పరిధిలో భూములను తప్పించటానికి అప్పటి వైసీపీ ప్రభుత్వ హయాంలో తహసీల్దార్ వనజాక్షి తన అధికారాన్ని అడ్డం పెట్టుకుని ట్రాన్స్‌కో అధికారులపై ప్రభావం చూపి భూములను అలైన్‌మెంట్ నుంచి తప్పించినట్టు ఆరోపణలు వస్తున్నాయి.

**ఇలా బయట పడింది..**

గుడివాడ-మెరకగూడెం 220 కేవీ ట్రాన్స్‌మిషన్ హైటెన్షన్ లైన్ అలైన్‌మెంట్‌కు సంబంధించి 2023, మార్చి 14న ట్రాన్స్‌కో ఎస్ఈ గజిట్ నోటిఫికేషన్ విడుదలకు ప్రభుత్వానికి లేఖ రాశారు. గజిట్ నోటిఫికేషన్ విడుదల కాకముందే అనధికారికంగా పెదపారుపూడి దగ్గర ఏడు కిలోమీటర్ల మేర అలైన్‌మెంట్‌ను మార్చేశారు. అంతర్గత సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టుగా ఇంటర్నల్ మినిట్స్‌లో పొందుపరిచారు. ఇదే సందర్భంలో 12 కిలోమీటర్ల మేర పనులు చేసుకోమని కాంట్రాక్టర్‌కు అనుమతులిచ్చినట్టు కూడా మినిట్స్‌లో ఉంది. ఇంటర్నల్ మినిట్స్‌లో పొందుపరిచిన అంశాలు సమాచార హక్కు చట్టం ద్వారా వెలుగుచూశాయి. వాస్తవానికి గజిట్ నోటిఫికేషన్‌కు లేఖ ఇచ్చినపుడు ఈ మార్పులు చేయకూడదు. ఈ క్రమంలో ట్రాన్స్‌కో ఎస్ఈ ఇచ్చిన లేఖ ప్రకారం 2023, ఏప్రిల్ 6న ప్రభుత్వం గజిట్ నోటిఫికేషన్‌ను వెలువరించింది. ఈ అలైన్‌మెంట్‌పై స్థానిక ప్రజల అభిప్రాయాలు, అభ్యంతరాలను కోరుతూ రెండు నెలల గడువు ఇచ్చారు. గజిట్ ప్రకారం రెండు నెలల్లో అభ్యంతరాలు తీసుకోవాల్సి ఉండగా, గజిట్ విడుదల కాకముందే అధికారులు అలైన్‌మెంట్ మార్చేశారు. తహసీల్దార్ వనజాక్షి ప్రభావం కారణంగానే అలైన్‌మెంట్‌ను మార్చారన్న ఆరోపణలు ఉన్నాయి. కిందటి వైసీపీ ప్రభుత్వ పెద్దల ఆదేశాల వల్ల కూడా అలైన్‌మెంట్‌ను మార్చినట్టు విమర్శలు ఉన్నాయి.

### అలైన్‌మెంట్ నుంచి తప్పించిన భూములన్నీ తహసీల్దార్ వనజాక్షి భర్త, వారి బంధువులవే..

- తహసీల్దార్ వనజాక్షి భర్త పొట్లూరి లోకేశ్‌కు చెందిన సర్వే నెంబర్ 29-1, 30-1, 30-2, 31-2, 32-1, 33-1 (ఎల్‌పీఎం నెంబర్ 92)లోని 11.51 ఎకరాల భూమి తప్పించిన అలైన్‌మెంట్ పరిధిలో ఉంది.
- బంధువైన కోడె వెంకట సుబ్బారావుకు చెందిన సర్వే నెంబర్ 183-4 (ఎల్‌పీ నెం.664) లోని 1.7 ఎకరాలు
- తహసీల్దార్ వనజాక్షి భర్త తరపు బంధువులైన పొట్లూరి రామకృష్ణ ప్రసాద్‌కు చెందిన సర్వే నెంబర్ 131 (ఎల్‌పీ నెం.315)లోని 5.52 ఎకరాలు, సర్వే నెంబర్ 239-2బీ (ఎల్‌పీ నెం.458)లో 3 ఎకరాలు
- పొట్లూరి ప్రమీలాదేవికి చెందిన సర్వే నెంబర్ 145-6 (ఎల్‌పీ నెం. 331)లోని 0.80 ఎకరాలు
- పొట్లూరి లలితకు చెందిన సర్వే నెంబర్ 145-5, 145-7ఏ, 145-7బీ (ఎల్‌పీ నెం.332)లో 1.9 ఎకరాలు, సర్వే నెంబర్ 155-1 (ఎల్‌పీ నెం.376)లో 2 ఎకరాలు, సర్వే నెంబర్ 182-1, 182-2ఏ, 284-16ఏ, 184- 16బీ, 184-17 (ఎల్‌పీ నెం.643)లో 1.77 ఎకరాలు
- పొట్లూరి వెంకటేశ్వరరావుకు చెందిన సర్వే నెంబర్ 143-4ఏ (ఎల్‌పీ నెం.329)లో 1.00 ఎకరం, సర్వే నెంబర్ 145-1 (ఎల్‌పీ నెం.340)లోని 0.76 ఎకరం
- పొట్లూరి సుజాతకు చెందిన సర్వే నెంబర్ 145-3, 146-4, 147-3, 148-3, 149-4 (ఎల్‌పీఎం నెంబర్లు 1037, 1038, 1040)లో 0.21 ఎకరం, 2.00 ఎకరాలు, 0.75 ఎకరం

# చెట్లు కొట్టేస్తున్నారు

## మైలవరం మండలంలో తొలగిస్తున్న మామిడి తోటలు

- 9 వేల నుంచి 6,800 ఎకరాలకు పడిపోయిన సాగు
- పెరిగిన పామాయిల్ సాగు



(ఆంధ్రజ్యోతి, మైలవరం రూరల్): మధుర ఫలం మామిడికి ఈ ఏడాది కూడా నష్టాలు వచ్చే పరిస్థితులు దాపురించడంతో మామిడి సీజన్ ప్రారంభం కాకముందే మైలవరం మండలంలో తోటలను రైతులు నరికివేస్తున్నారు. గత ఐదారు సంవత్సరాల నుంచి మామిడి పంట ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడంతో దాన్ని తీసివేసి వేరే పంటల సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. మార్కెట్‌లో నూజివీడు మామిడి తర్వాత మైలవరం ప్రాంత మామిడి కాయలకు మంచి పేరుంది. అయితే ప్రతి ఏడాది లాగే ఈ ఏడాది కూడా ఖర్చులు పెరిగి, దిగుబడి ఆశించిన స్థాయిలో మిగతా 8లో..



# ఇక భగభగ!

## నేడు, రేపు కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో వడగాడ్పులు

### నమోదు కానున్న అధిక ఉష్ణోగ్రతలు



మచిలీపట్నం/ఇబ్రహీంపట్నం, మార్చి6 (ఆంధ్రజ్యోతి): మార్చి మొదటి వారంలోనే కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలు మండిపోతున్నాయి. రానున్న రెండు రోజుల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతోపాటు వడగాడ్పులు వీస్తాయని వాతావరణశాఖ గురువారం జారీ చేసిన హెచ్చరికలు మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి. కృష్ణాజిల్లాలో గన్నవరం, చల్లపల్లి, ఘంటసాల, గుడివాడ, గుడ్లవల్లేరు. గూడూరు, కంకిపాడు, కోడూరు. మోపిదేవి, మిగతా 8లో..

# గల్లంతు!

## నీటిలో కొట్టుకుపోయిన అవుట్ ఫాల్ స్లూయిస్ గేట్లు

కృష్ణాడెల్టాలోని దివిసీమ, మచిలీపట్నం తదితర ప్రాంతాల్లో సముద్రపు నీరు పంట పొలాల్లోకి చొచ్చుకురాకుండా పంట కాలువల్లో ఏర్పాటు చేసిన అవుట్ ఫాల్ స్లూయిస్‌లు అనేక చోట్ల నీటిలో కొట్టుకుపోయాయి. తిరిగి వాటిని ఏర్పాటు చేయడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఫలితంగా ఏటా వేలాది ఎకరాల్లో పంటల సాగు ఆయా ప్రాంతాల్లో నిలిచిపోయింది. రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ఏడాదైనా వేసవిలో కాలువల పనులు చేస్తారా లేక నీటి విడుదల సమయంలో పనులు చేపట్టి మమ అనిపిస్తారా అని రైతులు ప్రశ్నిస్తున్నారు.



కోడూరు మండలం హంసలదీవి వద్ద శిథిలావస్థకు చేరిన అవుట్‌ఫాల్ స్లూయిస్

- దివిసీమ, మచిలీపట్నంలో పొలాల్లోకి చొచ్చుకొస్తున్న సముద్రపు నీరు
- వేలాది ఎకరాల్లో నిలిచిపోయిన పంటల సాగు
- అభివృద్ధికి నోచుకోని కాలువలతో రైతుల అవస్థలు
- ఇంకా అంచనాల దశలోనే ప్రతిపాదనలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : కృష్ణాడెల్టాలో రబీ సీజన్‌లో వరిసాగు కోసం కాలువలకు నీటిని విడుదల చేయకపోవడంతో రైతులు ఈఏడాది కాలువల నిర్వహణ పనులు చేస్తారని ఆశించారు. ఆరుతడి పంటగా మినుము సాగు చేశారు. ప్రస్తుతం మినుముతీత పనులు పూర్తయ్యేదశలో ఉన్నాయి. ఖరీఫ్ సీజన్‌లో తీరప్రాంతంలో ఆలస్యంగా వరినాట్లు వేసిన పొలాల్లో వరిపంటను కాపాడేందుకు గత నెల 26వ తేదీ వరకు విడతల వారీగా నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం కాలువలకు నీటిని నిలిపివేశారు. ఈ నెలాఖరుకు గానీ, ఏప్రిల్ మొదటి వారంలో గానీ తీర ప్రాంతంలోని తాగునీటి చెరువులను నింపేందుకు కాలువలకు నీటిని విడుదల చేస్తామని నీటిపారుదలశాఖ అధికారులు సూచనప్రాయంగా చెబుతున్నారు.

**ఏటా నష్టపోతున్న పంటలు**

కృష్ణాడెల్టాలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమై వరినాట్లు వేసే జూలై, ఆగస్టు నెలల్లో వరిపైరు నీటమునిగి, పంట చేతికొచ్చే నవంబరు, మిగతా 8లో..

**అవుట్ ఫాల్ స్లూయిస్‌ల నిర్మాణంపై నిర్లక్ష్యం**

దివిసీమ ప్రాంతంలోని కోడూరు, నాగాయలంక మండలాల్లో ఏడు అవుట్ ఫాల్ స్లూయిస్‌ల నిర్మాణం చేసేందుకు రూ.38.75 కోట్లతో అంచనాలు రూపొందించారు. రెండు నెలల క్రితం సాంకేతిక నిపుణులు అవుట్‌ఫాల్ స్లూయిస్‌లను పరిశీలించారు. తుది అంచనాలను రూపొందించి, అవుట్ ఫాల్ స్లూయిస్‌ల నిర్మాణానికి అనుమతులు ఇస్తామని అధికారులు అప్పట్లో చెప్పారు. అసెంబ్లీ సమావేశాల్లో ఇటీవల అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దివిసీమ ప్రాంతంలో పాడైన అవుట్ ఫాల్ స్లూయిస్‌లను బాగుచేయాలని కోరారు. అవుట్ ఫాల్ స్లూయిస్‌లు పాడవడంతో గత ఐదారు సంవత్సరాలుగా కోడూరు మండలం హంసలదీవి, ఇరాలి, తదితర గ్రామాల్లోని పొలాల్లోకి ఉప్పునీరు చొచ్చుకువస్తుండటంతో ఐదు వేల ఎకరాల్లో వరినాట్లు వేయకుండా రైతులు క్రాప్‌హాలీడే ప్రకటించాల్సి వచ్చింది..

## పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలి

- కలెక్టర్ బాలాజీ






విజయవాడలోని కేపీ నగర్‌లో నూతనంగా నిర్మించబోయే ఎన్టీఆర్ ట్రస్ట్ భవన నిర్మాణానికి గురువారం భూమి పూజ చేసి హారతి తీసుకుంటున్న ట్రస్టీ నారా భువనేశ్వరి



తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విజయవాడ ధర్నాచౌక్‌లో గురువారం ధర్నా నిర్వహిస్తున్న ఆశా వర్కర్లు

**రంజాన్ వేళలు**



ఇఫ్తార్ (సాయంత్రం) : 6-20 (శుక్ర)
సహర్ (ఉదయం) : 5-01 (శని)

## దుర్గగుడిలో చీరల గోల్‌మాల్‌పై నేడు, రేపు విచారణ

- 2018-2019 మధ్య రూ.కోట్ల విలువైన 33,686 చీరలు మాయం
- జూనియర్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యంపై ఆరోపణలు
- విచారణ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోనున్న ఈవో

ఇంద్రకీలాద్రి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో కోట్ల రూపాయల విలువైన చీరల గోల్‌మాల్ వ్యవహారంపై విచారణకు రంగం సిద్ధమైంది. శుక్ర, శనివారాల్లో ఆయా విభాగాల్లోని ఉద్యోగులను అధికారులు విచారించనున్నారు. వివరాల్లోకి వెళితే... ఇంద్రకీలాద్రిపై 2018 మే 25 నుంచి 2019 ఆగస్టు 31 వరకు చీరల విభాగంలో జూనియర్ అసిస్టెంట్ టి.సుబ్రహ్మణ్యం పనిచేసిన కాలంలో రూ.1,66,54,822 విలువ గల 33,686 సాధారణ చీరలు మాయమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆయనపై పలు అభియోగాలు మోపుతూ తాత్కాలికంగా విధుల నుంచి నిలుపుదల చేశారు. సుబ్రహ్మణ్యం తనపై వచ్చిన అభియోగాలను కోర్టులో సవాల్ చేశారు. దీంతో అతనిని తిరిగి ఉద్యోగంలోకి తీసుకున్నారు. ఇప్పుడు తాజాగా ఈవోగా వచ్చిన దేవదాయ కమిషనర్ కె.రామచంద్రమోహన్ గతంలో జరిగిన విషయాలన్నింటినీ పరిశీలించి చీరల గోల్ మాల్ విషయంలో అసలు ఏమి జరిగిందన్న దానిపై నిగ్గు తేల్చేందుకు డిప్యూటీ కమిషనర్ తదితరులతో విచారణ కమిటీని నియమించారు. విచారణ కమిటీ కొద్దిరోజుల క్రితం ప్రాథమిక సమాచారాన్ని సేకరించింది. శుక్ర, శనివారాల్లో ఆయా సంబంధిత విభాగాల ఏఈవోలు, సూపరింటెండెంట్లు, గుమస్తాలను విచారించనుంది. కాగా, ఈ గోల్ మాల్ మొత్తానికి కారణమనే ఆరోపణలు ఎదుర్కొంటున్న టి.సుబ్రహ్మణ్యం హైకోర్టు ఉత్తర్వుల మేరకు విధుల్లోనే కొనసాగడం గమనార్హం.

## అసెంబ్లీ వేదికగా



### గరికపాడు పాలిటెక్నిక్ కళాశాలలో వ్యవసాయ డిగ్రీ కోర్సులు ప్రారంభించాలి

- పోలంపల్లి డ్యాం మరమ్మతులకు నిధులు ఇవ్వండి
- వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించాలి
- దేవదాయ శాఖలో సంస్కరణలు చేయాలి
- ఎమ్మెల్యే తాతయ్య



**జగ్గయ్యపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) :** గరికపాడు కేవీకేలోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో అగ్రికల్చర్ బీఎస్సీని ప్రారంభించాలని, పోలంపల్లి మునేరు డ్యాం మరమ్మతులకు తక్షణం నిధులు కేటాయించాలని, ముక్త్యాల ఎత్తిపోతల పథకాన్ని పునఃప్రారంభించాలని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య గురువారం అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీలో మాట్లాడిన ఆయన గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీల కొరత వల్ల యాంత్రీకరణకు ప్రాధాన్యత ఇచ్చి సబ్సిడీపై పరికరాలు ఇవ్వాలని కోరారు. నియోజకవర్గంలో కీలకమైన పోలంపల్లి మునేరు ఆయకట్టు పరిరక్షణకు ఆనకట్ట రిపేర్లకు నిధులు వెంటనే విడుదల చేయాలని, గత ప్రభుత్వ నిర్వాకం వల్ల మూలనపడిన ముక్త్యాల ఎత్తిపోతల పథకాన్ని తిరిగి ప్రారంభించాలని కోరారు. గరికపాడు కేవీకేలో వ్యవసాయంపై డిగ్రీ కోర్సులు ప్రారంభించటంతో పాటు సేంద్రియ వ్యవసాయంపై రైతులకు శిక్షణ ఇవ్వాలని, సేంద్రియ ఉత్పత్తులను గుర్తించేందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

**ఒక ఆలయానికి 22 బ్యాంకు ఖాతాలా..**

దేవదాయ శాఖలో ఒక ఆలయానికి 22 బ్యాంకు ఖాతాలు అవసరమా అని తాతయ్య అసెంబ్లీలో ప్రశ్నించారు. తన కుటుంబీకులు ధర్మకర్తలుగా ఉన్న శ్రీరంగనాయకస్వామి దేవస్థానం నిర్వహణకు 22 బ్యాంకు ఖాతాలు ఉన్నాయని, ఇటీవల రాష్ట్రంలో ఒక ఆలయం డిపాజిట్లను ఇవో స్వాహా చేశారన్న ఆరోపణలు వచ్చాయని, ఇప్పటికైనా కరెంట్, సేవింగ్స్ అకౌంట్లు రెండు మాత్రం నిర్వహించేలా చూడాలని కోరారు. ఉద్యోగులు, సిబ్బందిల విషయంలో అనేక ఏజెన్సీలు వద్దని, సిబ్బంది నియామక విధానం రద్దు చేయాలని ఆయన కోరారు.

### అంబేడ్కర్ స్మృతివనం అభివృద్ధి చేయాలి

- బొండా ఉమా



**అజిత్‌సింగ్‌నగర్ :** విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి పరిచేందుకు నిధులు కేటాయించాలి. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే అంబేడ్కర్ భారీ విగ్రహం, స్మృతి వనం నిర్మిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇవ్వగా.. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే హడావుడిగా విగ్రహాన్ని ఏర్పాటు చేసి అసంపూర్తిగా ప్రారంభించారు. ప్రస్తుతం స్మృతివనంలో సరైన మౌలికసదుపాయాలు లేవు. ప్రభుత్వం నిధులు కేటాయించాలి.

### వెటర్నరీ కళాశాల ప్రహరీ మరమ్మతులకు నిధులు కేటాయించాలి

- యార్లగడ్డ వెంకట్రావు



**గన్నవరం :** వెటర్నరీ కళాశాల ప్రహరీకి మరమ్మతులకు నిధులు కేటాయించాలి. చేపట్టాలి. బ్రిటీష్ కాలంలో బ్రహ్మాండంగా ఉన్న కళాశాల ప్రభుత్వాలు మారుతుంటే ప్రాధాన్యతను కోల్పోతోంది. విమానాశ్రయం చెంతనే ఉన్న కళాశాల కళవిహీనంగా తయారైంది. దీని మరమ్మతులకు రూ.56లక్షలు మంజూరు చేయాలి. కేడీసీసీ బ్యాంకులో 2023లో కొనుగోలు చేసిన టీసీఎస్ సాఫ్ట్‌వేర్ అంశంపై విచారణ జరపాలి.

### మాజీ మంత్రి అవినీతిపై విచారణ చేపట్టండి

- వెనిగండ్ల రాము



**గుడివాడ :** వైసీపీ ప్రభుత్వ హయాంలో పౌరసరఫరాల శాఖ మంత్రి, అధికారుల కోట్లాది రూపాయల అవినీతిపై పూర్తిస్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకోవాలి. నాడు కొడాలి నాని పౌరసరఫరాల మంత్రిగా ఉండి పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని బొక్కేశారు. పట్టణంలో 40వేల రేషన్ కార్డులుంటే కేవలం 12వేల కార్డులకు కేంద్రం యిచ్చిన బియ్యం పంపిణీ చేశారు. మంత్రిగా ఉంటూ సొంత నియోజకవర్గంలోనే సగం మందికి బియ్యం పంపిణీ చేస్తే.. మిగిలిన బియ్యం ఎక్కడికి వెళ్లిందో పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని ఎమ్మెల్యే వెనిగండ్ల కోరగా.. స్పందించిన రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ పూర్తిస్థాయి విచారణచేపట్టి నివేదికను సభ ఎదుట ఉంచుతామని పేర్కొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ట్రస్ట్ సీఈవో రాజేంద్రకుమార్

### ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌ను సందర్శించిన సీఈవో రాజేంద్రకుమార్

- విద్యార్థులతో కలిసి భోజనం.. మోటివేషన్ క్లాస్



**చల్లపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) :** చల్లపల్లి మండలం పాగోలులోని ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌ను ఎన్టీఆర్ ట్రస్ట్ సీఈవో, విశ్రాంత డీజీపీ కె.రాజేంద్ర కుమార్ గురువారం మధ్యాహ్నం సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడిన ఆయన పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి, ఒత్తిడి ఎలా జయించాలి తదితర అంశాలపై వారికి సూచనలు చేశారు. భవిష్యత్‌లో ఏంకావాలనుకుంటున్నారు అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. స్టోర్‌రూమ్‌లో వంటకు ఉపయోగించే నిత్యావసర సరుకులు, కూరగాయలను పరిశీలించారు. ప్రిన్సిపాల్ మధుసూధనరావుతో పలు అంశాలపై చర్చించారు. హైస్కూల్ విద్య పూర్తయ్యేనాటికి క్రమశిక్షణ, ప్రతిభ కలిగిన ఉత్తమ విద్యార్థిగా తయారుకావాలని ఆ దిశగా విద్యాబోధన, విద్యార్థుల వ్యవహారశైలి ఉండాలని రాజేంద్ర కుమార్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, విజయవాడలో ఎన్టీఆర్ ట్రస్ట్ కార్యాలయ శంకుస్థాపన అనంతరం స్కూల్ విజిట్‌కు వచ్చినట్టు తెలిపారు.

# పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలి

- కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ
- లబ్ధిదారులకు రూ. 85 కోట్ల రుణాలు అందజేత

**మచిలీపట్నం టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) :** జిల్లాలో విరివిగా పరిశ్రమల స్థాపనకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ముందుకురావాలని, రుణాలు మంజూరులో బ్యాంకర్లు పూర్తి సహకారం అందించాలని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గురువారం స్థానిక రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న శుభం కన్వెన్షన్ హాలులో మెగా ఎంఎస్ఎంఈ రీచ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రూ.85 కోట్ల రుణాలు లబ్ధిదారులకు అందజేశారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు రూ.30 కోట్లు రుణాలు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ, పరిశ్రమల స్థాపనకు అనువైన ప్రాంతం జిల్లా అని, బ్యాంకర్లు కూడా విరివిగా రుణాలు అందించేందుకు ముందుకు వస్తున్నారని, ఈ అవకాశాన్ని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపనతో ఈ ప్రాంతం మరింత పారిశ్రామికాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలు ఎమ్మెస్ఎంఈ పరిశ్రమల స్థాపన ద్వారానే అభివృద్ధి చెందాయన్నారు. పరిశ్రమల స్థాపనతో పారిశ్రామికవేత్తలు ఆర్థికంగా బలోపేతం కావడం తోనే కాకుండా యువతకు విరివిగా ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో దోహదపడతారని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 85 కోట్ల రూపాయల రుణాలను మహిళా శక్తి సంఘాలకు కలెక్టర్ బాలాజీ అందజేశారు. కార్యక్రమంలో అగ్రికల్చరల్ బ్యాంక్ ఆఫ్ డెవలప్మెంట్ జీఎం తలశిల కామేశ్వరరావు, ఎస్ఎల్‌బిసి కన్వీనర్ జోన్ హెడ్ సీవీఎస్ భాస్కరరావు, ఇండస్ట్రీస్ జనరల్ మేనేజరు ఆర్ వెంకట్రావు, యూబీఐ రీజనల్ హెడ్ కె.వెంకట్రావు తదితరులు పాల్గొని ప్రసంగించారు. వివిధ బ్యాంకుల మేనేజర్లు, ఖాతాదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిట్టూర్పు మహిళలు ప్రదర్శించిన జనపనార సంచులు అందర్నీ ఆకట్టుకున్నాయి.



లబ్ధిదారులకు రుణాలు అందజేస్తున్న కలెక్టర్ బాలాజీ

# ఎస్టీవో కార్యాలయంలో నిధుల దుర్వినియోగం!

- అవనిగడ్డలో తనిఖీల కలకలం!
- ట్రెజరీ డైరెక్టర్ నేతృత్వంలో తనిఖీలు
- ఉద్యోగుల్లో ఆందోళన

**అవనిగడ్డ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) :** కృష్ణాజిల్లా అవనిగడ్డ ట్రెజరీ కార్యాలయంలో నిధులు దుర్వినియోగమైనట్టు ఆరోపణలు వెల్లువడటంతో ఆ శాఖ ఉన్నతాధికారులు చేపట్టిన తనిఖీలు ఖజానా శాఖలో కలకలాన్ని రేకెత్తించాయి. ట్రెజరీ శాఖలో ఉద్యోగులు పెన్షనర్ల పేరుతో నకిలీ ఖాతాలు సృష్టించి పెద్దఎత్తున నిధులు దారి మళ్లించారన్న ఫిర్యాదులు వెలువెత్తడటంతో ట్రెజరీ శాఖ డైరెక్టర్ ఎస్.మోహనరావు నేతృత్వంలో బుధవారం సాయంత్రం నుంచి రాత్రి 10 గంటల వరకు తనిఖీలు జరిగాయి. గురువారం కూడా తనిఖీలు కొనసాగుతున్నాయి. వార్షిక తనిఖీల్లో భాగంగానే అవనిగడ్డ ట్రెజరీ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్నట్టు తొలుత ట్రెజరీ అధికారులు చెప్పినప్పటికీ పెన్షనర్ల పేరుతో నకిలీ అకౌంట్లు సృష్టించి ఖాతాల నుంచి కొందరు ఉద్యోగులు తమ ఖాతాలకు నిధులు మళ్లించుకున్నట్టు తనిఖీల్లో వెల్లడైనట్లు తెలియవచ్చింది. ట్రెజరీశాఖ డైరెక్టర్ మోహనరావు ఆదేశాలతో ఏపీవో శ్రీదేవి పర్యవేక్షణలో ట్రెజరీ అకౌంట్ల తనిఖీలు నిర్వహిస్తున్నారు. ట్రెజరీ శాఖలో పనిచేస్తున్న ఓ సీనియర్ ఉద్యోగి జిల్లాకు చెందిన ఓ ఉన్నతాధికారి కనుసన్నల్లోనే నిధులు దారిమళ్లినట్టుగా ప్రాథమిక విచారణలో వెల్లడైనట్టుగా తెలియవస్తుంది. ట్రెజరీ శాఖ ఉద్యోగుల నుంచి విశ్వసనీయంగా అందుతున్న సమాచారం మేరకు దాదాపు 1.7 కోట్ల మేర నిధులు దారిమళ్లినట్టు వార్తలు వెలువడుతుండగా, ఈ విషయమై డైరెక్టర్ ఎస్.మోహనరావును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా, పెన్షనర్ల డబ్బు దారిమళ్లుతున్నట్టు వచ్చిన ఫిర్యాదుల మేరకు విచారణ చేస్తున్నామని, ఇందుకోసం ఓ కమిటీని నియమించి రికార్డులను పరిశీలిస్తున్నామని, మరో రెండు రోజుల్లో పూర్తి వివరాలు వెల్లడవుతాయని తెలిపారు.

**ట్రెజరీ ఉద్యోగుల్లో ఆందోళన**

నియోజకవర్గ చరిత్రలో ఎన్నడులేని రీతిలో అవనిగడ్డ ఎస్టీవో కార్యాలయంలో నిధులు దారిమళ్లినట్టు ఆరోపణలు రావటం, సదరు ఆరోపణలపై రాష్ట్ర అధికారులే విచారణకు రావటంతో ట్రెజరీ ఉద్యోగుల్లో కలకలం మొదలైంది. ఇప్పటికే ఎస్టీవో కార్యాలయంలో తనిఖీల్లో పలువురు జిల్లాస్థాయి అధికారులు, సీనియర్ అధికారుల పేర్లు వెల్లడవుతుండటంతో ఇది ఎక్కడికి దారి తీస్తుందోనని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ఇన్‌స్పైర్ మనక్‌కు కృష్ణాలో 144 మంది ఎంపిక

- డీఈవో రామారావు

**మచిలీపట్నం టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) :** నేషనల్ ఇన్నోవేషన్ మిషన్ విడుదల చేసిన ఇన్‌స్పైర్ మనక్‌కు కృష్ణాజిల్లా నుంచి 144 మంది విద్యార్థులు అర్హత సాధించారని డీఈవో పీవీజే రామారావు తెలిపారు. ఎంపికైన 144మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున బ్యాంకు ఎకౌంట్లలో నగదు జమ అవుతుందన్నారు. ఈ నగదుతో ప్రాజెక్టు నమూనాను అప్‌లోడ్ చేసి ప్రదర్శించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఇందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సహకరించాలని, ప్రదర్శనకు తీసుకుని వెళ్లేందుకు ప్రోత్సహించాలన్నారు. నగదు అవార్డు పొందిన 144మంది విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చిన ఉపాధ్యాయులను డీఈవో అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ జాకీర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

### టైలరింగ్ శిక్షణకు దరఖాస్తులు

**కలెక్టరేట్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) :** వెనుకబడిన తరగతుల కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధి చేయుటలో భాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు కోరుతున్నట్టు కార్యనిర్వాహక సంచాలకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వెనుకబడిన తరగతులకు చెందిన బీసీ మహిళలు, ఆర్థికంగా బలహీనవర్గాలకు చెందిన (ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ) చెందిన మహిళలు, కాపు (కాపు, తెలగ, బలిజ, ఒంటరి) కులాలకు చెందిన మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్పొరేషన్ల వారీగా.. బీసీ కార్పొరేషన్-1674, కాపు కార్పొరేషన్-544, ఈబీసీ కార్పొరేషన్-380, కమ్మ కార్పొరేషన్-1027, రెడ్డి కార్పొరేషన్-333, క్షత్రియ కార్పొరేషన్-62, ఆర్యవైశ్య కార్పొరేషన్-354, బ్రాహ్మణ కార్పొరేషన్-254 మందికి కేటాయించనున్నట్టు చెప్పారు.

**దరఖాస్తుకు అర్హతలు**

దరఖాస్తు చేసుకునే మహిళలు సంబంధిత కులధృవీకరణ పత్రము కలిగి, వయస్సు 18 నుంచి 50 సంవత్సరాలలోపు వుండాలి. తెల్లరేషన్ కార్డు, ఆధార్ కార్డు కలిగి వుండాలి. మార్చి 7 నుంచి ఆన్‌లైన్ ద్వారా హెచ్‌టీటీపీఎస్://ఏపీఓబీఎంఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్/వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. గ్రామ, వార్డు సచివాలయం/మండల పరిషత్ అభివృద్ధి అధికారి/మున్సిపల్ కమిషనర్ల కార్యాలయంలో తమపేర్లు నమోదు చేసుకోవాలని ప్రకటనలో తెలిపారు.

### జైపూర్ సదస్సుకు ఏపీ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి

**భారతీనగర్, మార్చి6 (ఆంధ్రజ్యోతి) :** జైపూర్‌లో రెండు రోజులుగా ఆసియా అండ్ పసిఫిక్ యూఎన్ కాన్ఫరెన్స్ సదస్సులో ఒక ముఖ్య సెషన్‌కు ప్రతినిధిగా వ్యవహరించడంతో పాటు సర్క్యులర్ ఎకానమీ, సస్టైనబుల్ డెవలప్ మెంట్ గోల్స్‌పై ఈఎస్‌సిఏపి (ఎకనామిక్ అండ్ సోషల్ కమిషన్ ఫర్ ఆసియా పసిఫిక్), యుఎన్‌సిఆర్‌డి (యునైటెడ్ నేషన్స్‌సెంటర్ ఫర్ రీజినల్ డెవలప్ మెంట్)ల రెండు ముఖ్యమైన నివేదికలను రాష్ట్రం తరపున విడుదల చేసినట్టు ఏపీ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న అంతర్జాతీయ ప్రేక్షకులను ఉద్దేశించి ప్రసంగించే అరుదైన అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు కృషిచేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు గురించి సదస్సులో ప్రస్తావించానని తెలిపారు.



సదస్సులో మాట్లాడుతున్న పట్టాభిరామ్

## గౌడ సామాజికవర్గాలకు
# మద్యం దుకాణాల కేటాయింపు

- కృష్ణాలో 12, ఎన్టీఆర్ జిల్లాలో 11

**మచిలీపట్నం, మార్చి6 (ఆంధ్రజ్యోతి) :** గౌడ సామాజికవర్గాలకు కృష్ణాజిల్లాలో 12మద్యం దుకాణాలను జేసీ గీతాంజలి శర్మ లాటరీతీసి కేటాయించారు. కలెక్టరేట్‌లో గురువారం ప్రక్రియను నిర్వహించారు. 12మద్యం దుకాణాలకు 280 దరఖాస్తులు రాగా, తొలుత మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్, గుడివాడ, పెడన, తాడిగడప పురపాలకసంఘాల్లోని మద్యం దుకాణాలకు లాటరీ తీశారు. అనంతరం గూడూరు, గుడివాడ, మచిలీపట్నం, పమిడిముక్కల పెడన, కోడూరు, పెదపారుపూడి, బంటుమిల్లి మండలాల్లోని మద్యం దుకాణాలకు లాటరీతీసి షాపులను కేటాయించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. గౌడ, గౌడ్, శెట్టిబలిజ సామాజిక వర్గాలకు మద్యం దుకాణాలను ప్రభుత్వం కేటాయించిందన్నారు. లాటరీపద్ధతిలో దుకాణాలు దక్కించుకున్న వారు కులధృవీకరణపత్రాలు 24గంటల వ్యవధిలో అధికారులకు అందజేయాల్సి ఉందన్నారు. లేకుంటే లాటరీలో రిజర్వుగా ఉంచిన రెండోనెంబరుకు షాపును కేటాయించడం జరుగుతుందన్నారు. తాడిగడపలోని మద్యం దుకాణానికి మండవల్లికి చెందిన మహిళ దరఖాస్తు చేశారని, ఆమె కృష్ణాజిల్లావాసి కాకపోవడంతో ఆ దరఖాస్తు చెల్లుబాటు కాదని జేసీ ప్రకటించారు. విజయవాడ ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ వై.శ్రీనివాసచౌదరి, కృష్ణా ఎక్సైజ్ కార్యాలయ సూపరింటెండెంట్ జి.గంగాధరరావు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ భార్గవ్, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.



లాటరీ తీసి దుకాణదారుల నెంబరు ప్రకటిస్తున్న జేసీ గీతాంజలిశర్మ

**ఎన్టీఆర్ జిల్లాలో 11 దుకాణాలు**

**విద్యాధరపురం :** ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ ఆధ్వర్యంలో గురువారం గౌడ కులస్థులకు 11 మద్యం దుకాణాలు లాటరీ ప్రక్రియ ద్వారా కేటాయించారు. విజయవాడ రూరల్ గొల్లపూడిలోని బీసీ భవన్‌లో లాటరీ ద్వారా దుకాణాల కేటాయింపు ప్రక్రియ జరిగింది. జిల్లా వ్యాప్తంగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా 335 దరఖాస్తులు రాగా లాటరీ ప్రక్రియ ద్వారా 11 దుకాణాలను దరఖాస్తుదారులకు కేటాయించారు. అనంతరం ప్రొవిజినల్ లైసెన్స్ జారీ చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అధికారులు టి.శ్రీనివాసరావు, ఎస్.శ్రీనివాసరావు, రామశివ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



లాటరీ ప్రక్రియలో మద్యం షాపులు కేటాయిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ



పైపులైన్ పనుల్ని అడ్డుకుంటున్న నందలూరు గ్రామ రైతులు

# మా భూముల్లో పైపులు వేస్తారా..!

- సెంటినీ ఫ్యాక్టరీ పైపులైన్ పనులను అడ్డుకున్నరైతులు

**వీరులపాడు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) :** కంచికచర్ల మండలం గండేపల్లి గ్రామంలో ఉన్న సెంటిని ఫ్యాక్టరీకి వీరులపాడు మండలం నందలూరు గ్రామ శివారు వైరా కట్లేరు నుంచి అక్రమంగా చేపట్టిన నీటి పైపులైన్‌ను రైతులు గురువారం అడ్డుకున్నారు. ఫ్యాక్టరీ సిబ్బంది యంత్రాలు, పైపులను తీసుకొని కట్లేరు వద్దకు రావడంతో విషయం తెలుసుకున్న రైతులు అక్కడికి చేరుకొని పనుల్ని అడ్డుకొని మా భూముల్లో మీరెలా పైపులు వేస్తారని ప్రశ్నించారు. దీంతో అనుమతులు ఉన్నాయని ఫ్యాక్టరీ ప్రతినిధులు చెబుతున్నారే తప్ప వాటిని చూపడం లేదని రైతులు ఆరోపించారు. మా పట్టా భూముల్లో పైపులైన్ వేస్తే ఊరుకునేది లేదని రైతులు పట్టుబట్టారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకొని ఫ్యాక్టరీ ప్రతినిధులతో మాట్లాడి రెవెన్యూ అధికారులను పిలిచి సర్వే చేయగా రైతు పట్టా భూముల్లోనే పైపులైన్ వేస్తున్నారని తేలింది. దీంతో యంత్రాలను బయటకు పంపివేశారు. పైపులైన్ వేసే చోటే నుంచి నందలూరు, జమ్మవరం, బోడవాడ గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతుంది. నందలూరు, గండేపల్లి గ్రామాలకు సాగునీరు అక్కడి నుంచే పంపింగ్ స్కీమ్ ద్వారా వెళుతుంది. ఇక్కడ నుంచి పైపులైన్ వేసి ఫ్యాక్టరీకి నీరు ఇస్తే మాకు సాగు, తాగునీటికి కష్టాలు తప్పవని రైతులు వాపోతున్నారు. రైతులు కిలారు సంగమేశ్వరరావు, దగ్గుపాటి సీతామహాలక్ష్మి, బెల్లంకొండ నారాయణ, బెల్లంకొండ భారతమ్మ, బెల్లంకొండ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



తమ భూముల పట్టాలను చూపుతున్న రైతులు

### పవన్ గన్నవరం పర్యటన వాయిదా

**గన్నవరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) :** గన్నవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేతులమీదుగా ప్రారంభం కావాల్సిన స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్ ప్రారంభోత్సవ కార్యక్రమం వాయిదా పడినట్టు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. 2, 3 వారాల తరువాత నిర్వహించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది మూడు రోజుల నుంచి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేశారు. జాతీయ రహదారి నుంచి పాలిటెక్నిక్ కళాశాల వరకు రోడ్డు నిర్మాణం చేయటంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దారు.

# చెట్లు కొట్టేస్తున్నారు

(7వ పేజీ తరువాయి)

లేకపోవడంతో మామిడి రైతులు చెట్లను తెగనమ్ముకుంటున్నారు. సైజును బట్టి ఒక్కో చెట్టును రూ.4వేల నుంచి 6వేల వరకు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. గతంలో మైలవరం మండలంలో తొమ్మిది వేల ఎకరాల విస్తీర్ణంలో మామిడి తోటలు ఉండేవి. ఐదు సంవత్సరాల నుంచి వివిధ కారణాలతో తోటలు నరికి వేస్తుండటంతో ప్రస్తుతం మామిడి తోటల విస్తీర్ణం 6,800 ఎకరాలకు పడిపోయింది. రానున్న రోజుల్లో కూడా మామిడి తోటలకు గడ్డు కాలం నడిస్తే మార్కెట్‌లో మైలవరం మామిడి కనుమరుగయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మామిడి పంట సాగుకు కూడా సబ్సిడీలు ప్రకటించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

**పెరిగిన ఖర్చులు, తగ్గిన దిగుబడి**

మామిడి తోటల సాగుకు గతం కంటే ప్రస్తుతం ఖర్చులు అధికమయ్యాయి. వర్షాకాలంలో దుక్కులు, చెట్లకు బలం కోసం భూమిలో మందులు, కాపు సమయంలో రసాయనిక మందులను అధికంగా పిచికారీ చేస్తుండటంతో ఎకరాకు రూ.20 వేల నుంచి 30 వేలు ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది పూతలు ఆశించిన స్థాయిలో పూసిన తెగుళ్ల ధాటికి పూత రాలిపోయి చెట్లకు కాడలు మాత్రమే దర్శనమిస్తున్నాయి. గత రెండేళ్ల నుంచి నల్లి, పేలు మామిడి తోటలను ఆశిస్తుండటంతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. వీటి నివారణకు ఎన్నో రకాల మందులు పిచికారీ చేసినా ఫలితం ఉండటం లేదని రైతులు చెబుతున్నారు. మామిడి తోటలను తెగనరకడంలో నల్లి, పేలు పాత్ర అధికంగా ఉందని అంటున్నారు. దీంతో ఖర్చులు పెరిగి, ఆశించిన స్థాయిలో దిగుబడి రాక నష్టాలు చవిచూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మామిడి తోట స్థానంలో పామాయిల్ మొక్కలు

**పామాయిల్ సాగుకు మొగ్గు**

మామిడి తోటల స్థానంలో అధికశాతం మంది రైతులు పామాయిల్ తోటలను సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. గత రెండేళ్లుగా మైలవరం మండలంలో పామాయిల్ సాగు అధికమయ్యింది. పామాయిల్ సాగుకు ప్రభుత్వం పలు రకాల సబ్సిడీలు ఇస్తుంది. దీంతో సాగుకు ఖర్చులు తక్కువతోపాటు మార్కెట్‌లో పామాయిల్ పంటకు డిమాండ్ ఉండటంతో మైలవరం మండలంలో సుమారు 2వేల ఎకరాల్లో పామాయిల్ పంటను సాగు చేస్తున్నారు.

**ముదురు తోటలు తొలగిస్తున్నారు**

**- సొహైల్ అహ్మద్, ఉద్యానశాఖ అధికారి**

40 సంవత్సరాల వయసున్న మామిడి చెట్లను రైతులు నరికివేస్తున్నారు. ఆయా తోటల్లో మందులు పిచికారీ కష్టంగా మారింది. దీంతో రైతులు మామిడి తోటలు తీసివేసి పామాయిల్, జామ, తదితర వాటిపై దృష్టి పెడుతున్నారు.

# గల్లంతు!

(7వ పేజీ తరువాయి)

డిసెంబరు నెలల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జిల్లాకు చెందిన రైతులు వేలాది ఎకరాల్లో పంటను ఏటా నష్టపోతున్నారు. రైతులు పంటలు నష్టపోకుండా ఉండాలంటే ఈ ఏడాదైనా కాలువలు నిర్వహణ పనులు ఈ వేసవిలో పూర్తి చేసేందుకు త్వరితగతిన అంచనాలు తయారు చేసి అనుమతులు ఇవ్వాలి. ఇటీవల కలెక్టర్ బాలాజీ నీటిపారుదలశాఖ అధికారులతో సమావేశం నిర్వహించి కాలువల నిర్వహణ పనులకు అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. అయితే కలెక్టర్ ఆదేశాలు ఎక్కడ అమలయ్యే సూచనలు కనిపించడం లేదు. దివిసీమ ప్రాంతంలో సాగు నీటి సంఘాల ద్వారా ఈ పనులకు సంబంధించిన అంచనాలను తయారు చేశారు. మచిలీపట్నం, గుడివాడ డివిజన్‌లో ఈ పనుల అంచనాలు ఇంకా కొలిక్కిరాలేదని, ఆ పనిలోనే ఉన్నామని నీటిపారుదలశాఖ అధికారులు చెబుతున్నారు. వేసవిలో మురుగు కాలువల్లోకి కత్తెరపోటు సమయంలో వచ్చే ఉప్పునీటి ప్రభావంతో ఎక్కువశాతం గుర్రపుడెక్క, తూడు, నాచు చనిపోతుంది. ఇంకా మిగిలిన తూడు, గుర్రపుడెక్కలను నిర్మూలించేందుకు రసాయనాలు పిచికారీ చేస్తారు. ప్రధాన కాలువలు, బ్రాంచ్ కాలువలకు ఉన్న డ్రాప్‌లు, రెగ్యులేటర్లకు కనీస మరమ్మతుల తోపాటు సాగునీటి సంఘాల సూచనలతో ఈ వేసవిలో ఏప్రిల్ నుంచి జూలై వరకు ఈ వేసవిలో కాలువలలో పూడికతీత, కాలువగట్ల బలోపేతం వంటి పనులు చేయాలని రైతులు కోరుతున్నారు.

**మరమ్మతులకు నోచుకోని న్యాకోన డ్రెయిన్ అవుట్‌ఫాల్**

మచిలీపట్నం మండలంలోని భోగిరెడ్డిపల్లి నెలకుర్రు, ఎస్-గొల్లపాలెం, తుమ్మలచెరువు, తుమ్మలపాలెం, చిన్నాపురం, కోన, వాడపాలెం, వెంకటదుర్గాంబపురం, కొత్తపల్లె తుమ్మలపాలెం, వాడగొయ్యి, పెదయాదర, కమ్మవారిచెరువు గ్రామాల పరిధిలోని పొలాల్లోని మురుగు నీటిని డేగలకోడు, యాదర డ్రెయిన్, వాడగొయ్యి డ్రెయిన్, మంగల్లం కకోడు, మధ్యకాలువల ద్వారా కోన-వాడపాలెం గ్రామాల మధ్య సముద్రపు కరకట్ట వద్ద అవుట్‌ఫాల్ స్లూయిస్‌ల ద్వారా సముద్రంలోకి వదులుతారు. కరకట్ట కింద ఆరుఖానాలతో పాత అవుట్‌ఫాల్‌స్లూయిస్ పాడవడంతో ఎనిమిదేళ్ల క్రితం మరో అవుట్‌ఫాల్ స్లూయిస్‌ను నిర్మించారు. పాత, కొత్తఅవుట్‌ఫాల్ స్లూయిస్‌ల గేట్లు పాడైపోయి నీటిలో కొట్టుకుపోయాయి. దీంతో ఈ రెండింటి నుంచి పొలాల్లోకి ఉప్పునీరు చొచ్చుకువచ్చి 12 గ్రామాల పరిధిలోని 4,500 ఎకరాల్లో వరిసాగు ప్రశ్నార్థకంగా మారింది. ఈ వేసవిలోనైనా ఈ స్లూయిస్ గేట్లకు మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.

# ఇక భగభగ!

(7వ పేజీ తరువాయి)

మొవ్వ, నందివాడ, నాగాయలంక, పామర్రు, పెదపారుపూడి, పెనమలూరు, ఉయ్యూరు మండలాల్లో శుక్ర, శనివారాల్లో 39 నుంచి 42.2 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయని అధికారులు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలోని జి.కొండూరులో 39.8, గంపలగూడెం 39.7, ఇబ్రహీంపట్నం 40.8, కంచికచర్ల 40, విజయవాడ రూరల్‌లో 39.7, విజయవాడ అర్బన్ 39.8లో డిగ్రీల ఉష్ణోగ్రతలు శనివారం నమోదు కానున్నాయి. రెండు జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## రేపటి నుంచి పురుషుల ఇంటర్ గేమ్స్ ప్రారంభం

**గన్నవరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):** చిన అవుటపల్లిలోని డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో ఈ నెల 8వ తేదీ నుంచి 17 వరకూ డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఆధ్వర్యంలో 26వ పురుషుల ఇంటర్ మెడికల్ గేమ్స్ మీట్ 2024-25 నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ భీమేశ్వర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పరిధిలో ఉన్న అన్ని మెడికల్ కళాశాల నుంచి క్రీడాకారులు 1200 మంది క్రీడా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పోటీలను హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వేమిరెడ్డి రాధికా రెడ్డి ప్రారంభిస్తారని చెప్పారు. సిద్ధార్థ అకాడమి అధ్యక్షులు ఎం.రాజయ్య, కార్యదర్శి పి.లక్ష్మణరావు కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, డైరెక్టర్ డాక్టర్ సీవీరావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.అనీల్‌కుమార్ తదితరులు హాజరవుతారని తెలిపారు.




వీఆర్ సిద్ధార్థలో యువసమ్మేళనంలో మాట్లాడుతున్న ఐఏఎస్ అధికారిణి శారదాదే వి

## భిన్నత్వంలో ఏకత్వమనేది భారతదేశ గొప్పదనం

**పెనమలూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి):** భిన్నత్వంలో ఏకత్వమనేది భారతదేశ గొప్పతనమని ఏపీ స్టేట్ యూత్ సర్వీసెస్ కమిషనర్, స్టెప్ ఎండీ కే శారదాదేవి అన్నారు. కానూరు సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ మెకానికల్ కాన్ఫరెన్స్ హాల్లో గురువారం కేంద్ర యువజన వ్యవహారాలు , క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువకేంద్రం విజయవాడల ఆధ్వర్యంలో బుధవారం నుంచి ఐదు రోజుల పాటు జరిగే అంతర్రాష్ట్రీయ యువ సమ్మేళనంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. శారదాదేవి మాట్లాడుతూ ప్రజల మధ్య సాంప్రదాయకంగా ఉన్న భావోద్వేగాలను, బంధాలను బలోపేతం చేసేందుకు ఇటువంటి యువ సమ్మేళనాలు దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమానికి కేరళ రాష్ట్రంలోని ఆరు జిల్లాల నుండి 27మంది యువతీ,యువకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా రోడ్డు ట్రాన్స్‌పోర్టు కమిషనర్ మోహన్‌కుమార్ , కళాశాల ఇంజనీరింగ్ విభాగ డీన్ వెంకట్రావు, నెహ్రూ యువ కేంద్రం అధికారి సుంకరరాము, రాష్ట్ర యూత్ సర్వీసెస్ డైరెక్టర్ రామకృష్ణ, జిల్లాయువజనశాఖ సీఈవో శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ అధికారి కే నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## టైలరింగ్ ఉచిత శిక్షణకు పేర్లు నమోదు చేసుకోవాలి

**ఉయ్యూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) :** మండల పరిధిలోని ఆర్థికంగా వెనుకబడిన తరగతులు( ఈబీ సీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, కాపు, తెలగ బలిజ, ఒంటరి)కు చెందిన మహిళలు ఉచిత కుట్టు శిక్షణకు పేర్లు నమోదు చేసుకోవాలని ఎంపీడీవో శేషగిరిరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 60 సంవత్సరాల లోపు వయస్సు కలిగి, తెల్ల రేషన్ కార్డు కలిగిన మహిళలు ఆన్‌లైన్‌లో కానీ, గ్రామపంచాయతీ కార్యాలయం , మండల పరిషత్ కార్యాలయాలో పేర్లు నమోదుచేసుకోవాలని ఆయన కోరారు. తెల్లరేషన్ కార్డు, ఆధార్ కార్డు తీసుకొచ్చి తమ పేర్లు నమోదుచేసుకోవాలని ఆయన తెలిపారు.

## బాలికను వేధిస్తున్న బాలుడి అరెస్టు

**కంకిపాడు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) :** గొడవర్రు గ్రామానికి చెందిన ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న బాలిక(16)ను వేధిస్తున్న బాలుడి (17)పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్టు కంకిపాడు ఎస్సై డి సందీప్ తెలిపారు. మండలంలోని గొడవర్రు గ్రామానికి బాలికను అదే గ్రామానికి చెందిన బాలుడు తనను ప్రేమించాలంటూ వేధింపులకు దిగాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు బాలుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

# జగన్ వ్యాఖ్యలపై జనసేన నిరసన

**హనుమాన్‌జంక్షన్, మార్చి 6 ( ఆంధ్రజ్యోతి):** గత ఐదేళ్లుగా హత్యా రాజకీయాలు నిర్వహించి రాష్ట్రాన్ని అధోగతి పాల్జేసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై చౌకబారు వ్యాఖ్యలు చేయడం అత్యంత శోచనీయమని జనసేన నియోజకవర్గం సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ బాబు అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై జగన్మోహన్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ జంక్షన్ సెంటర్‌లో జనసేన ఆధ్వర్యంలో గురువారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. జగన్‌రెడ్డి డౌన్ డౌన్, పోలీస్ స్టేషన్‌కు తక్కువ.....సంట్రల్ జైలుకు ఎక్కువ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఖ్యాతి గడించిన వ్యక్తిత్వం పవన్ కల్యాణ్‌దే నన్నారు. రాష్ట్రాభివృద్ధిని దిగజార్చిన జగన్మోహన్‌రెడ్డిని రాష్ట్ర రాజకీయాల నుంచి శాశ్వతంగా బహిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి చిమటా రవివర్మ, మండల అధ్యక్షుడు వడ్డి శివనాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు సమీర్, జంక్షన్ పట్టణ అధ్యక్షుడు అహమ్మద్, వీరమహిళలు సింగవరపు సూర్యవతి, జయరాణి, లక్ష్మీప్రసన్న, సుజని పాల్గొన్నారు.



జంక్షన్‌లో నిరసన తెలుపుతున్న జనసేన నాయకులు

### పవన్ కల్యాణ్‌ను విమర్శించే నైతిక అర్హత వైసీపీ నాయకులకు లేదు: పులి కామేశ్వరరావు

**కంకిపాడు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) :** రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన రాష్ట్రాధ్యక్షులు పవన్ కళ్యాణ్‌ను విమర్శించే నైతిక అర్హత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి, వైసీపీ నేతలకు లేదని జనసేన పార్టీ ప్రచార కమిటీ జిల్లా కో ఆర్డినేటర్ పులి కామేశ్వరరావు అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు నాయకుడుని , డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను విమర్శించిన వల్లభనేని వంశీ, పోసాని కృష్ణమురళి, వంటి వైసీపీ నాయకులు ఊసలు లెక్కపెడుతున్నారన్నారు. ఈ సమావేశంలో స్థానిక జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### పవన్‌కల్యాణ్‌పై విమర్శలు చేస్తే సహించేది లేదు

- జనసేన జిల్లా జాయింట్ సెక్రటరీ చిమట రవివర్మ హెచ్చరిక

**గన్నవరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):** డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను విమర్శిస్తే ఊరుకునే పరిస్థితి లేదని, తగిన బుద్ధి చెబుతామని జనసేన జిల్లా జాయింట్ సెక్రటరీ చిమట రవివర్మ హెచ్చరించారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని వాటిని పరిష్కరిస్తుంటే చూసి ఓర్వలేకే వైసీపీ నేతలు పవన్ కల్యాణ్‌ను విమర్శిస్తున్నారన్నారు. ప్రతిపక్ష హోదా అర్హత లేని జగన్‌మోహన్‌రెడ్డి ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. జగన్మోహన్‌రెడ్డి బడుగు బలహీన వర్గాలకు చేసిందేమీ లేదని వ్యాఖ్యానించారు. పవన్ కల్యాణ్ గురించి అవాకులు, చవాకులు మాట్లాడితే సహించేది లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

## మొరాయిస్తున్న సర్వర్లు .. లైసెన్స్‌ల కోసం పడిగాపులు

**ఉయ్యూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):** ఉయ్యూరు ఆర్టీవో కార్యాలయంలో రోజుల తరబడి తరచూ సర్వర్లు మొరాయించడంతో లైసెన్స్‌ల కోసం దరఖాస్తులు చేసుకున్నవారు కార్యాలయం వద్ద పడిగాపులు పడాల్సి వస్తోంది. సర్వర్లు ఎప్పుడు పనిచేస్తాయో..ఎప్పుడు మొరాయిస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో లైసెన్స్ కోసం స్లాట్ బుకింగ్ చేసుకున్నవారు కారాలయం వద్ద ఎండలో పడిగాపులు గాయాల్సివస్తుంది. స్లాట్ బుకింగ్‌లో వచ్చిన సమయం ప్రకారం కార్యాలయానికి వచ్చిన వారు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎదురుచూసి, చేసేదేమీ లేక తిరిగి ఇళ్లకకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. సర్వర్లు పనిచేయకపోతే తాము ఏమీ చేయలేమని ఉద్యోగులు చేతులెత్తేయడంతో దరఖాస్తుదారులు రోజుల తరబడి కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సివస్తుందని వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఆర్టీవో కార్యాలయం వద్ద లైసెన్స్‌ల కోసం పడిగాపులు పడుతున్న దరఖాస్తుదారులు

### ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో స్కాట్స్‌పైన్ విద్యార్థినికి స్థానం

**పెనమలూరు, మార్చి 6( ఆంధ్రజ్యోతి):** కానూరులోని స్కాట్స్‌పైన్ ఇంటర్నేషనల్ పాఠశాలలో నాల్గో తరగతి చదువుతున్న సరయూ అనే విద్యార్థిని తన రెండు చేతులతో హులాహూప్‌ను తిప్పుతూ 45సెకండ్లలోనే 1నుంచి 30 సంఖ్యల వర్గాలను చెప్పి ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో స్థానం దక్కించుకుంది. అతి చిన్న వయస్సులో ఈ రికార్డును సాధించిన విద్యార్థినిని రవీంద్రభారతి సంస్థల చైర్మన్ వీరమాచినేని వంశీ కృష్ణ, డైరెక్టర్ శాంతి, ప్రిన్సిపాల్ ప్రతిమ చలసానిలు అభినందించారు.



విద్యార్థినిని అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

## మామిడి సాగుపై రైతులకు శిక్షణ నేడు

**గన్నవరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని గోపవరపుగూడెం గ్రామంలో శుక్రవారం మామిడి సాగుపై ప్రత్యేక శిక్షణ నిర్వహిస్తున్నట్టు ఉద్యానవన శాఖాధికారి ఈ హరిచంద్ ఒక ప్రకటనలో తెలిపారు. శాస్త్రవేత్త మహాలక్ష్మీ, జిల్లా ఉద్యానవన శాఖాధికారి కె.జ్యోతి పాల్గొని మామిడి సాగులో వస్తున్న మార్పులపై అవగాహన కల్పిస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని మామిడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



# నేటి నుంచి సీతారామచంద్రమూర్తి స్వామి శతాబ్ది ఉత్సవాలు

**హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి):** బొమ్ములూరులోని సీతారామచంద్రమూర్తి స్వామి దేవాలయ శతాబ్ది మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ శతాబ్ది మహోత్సవాలు ముత్తేవి వేంకట సత్యన్నారాయణాచార్యుల పర్యవేక్షణలో శుక్రవారం తెల్లవారు జామునుంచే దీక్షా సంబంధిత వైదిక కార్యక్రమాలతో ప్రారంభంకానున్నాయి. 9వతేదీ ఆదివారం ఉదయం 10. 26గంటలకు చిదానంద ఆశ్రమ, భువనేశ్వరీ పీఠాధిపతులు కమలానంద భారతిస్వామి చేతులమీదుగా ఆలయ గోపుర నూతన కలశ పునఃప్రతిష్ఠ, నూతన ధ్వజ స్తంభ పునఃప్రతిష్ఠ, మహా కుంభాభిషేకం నిర్వహించనున్నామని కమిటీ సభ్యులు వివరించారు. పునఃప్రతిష్ఠ అనంతరం శ్రీరామ రాజ్య పట్టాభిషేకం నిర్వహించనున్నామని తెలిపారు. భక్తులందరూ తప్పక విచ్చేసి సీతారామచంద్రమూర్తి స్వామి శతాబ్ది మహోత్సవాలలో పాల్గొనాలని ముసునూరి వెంకయ్య వారసులు, కమిటీ సభ్యులు కోరారు.



సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న విద్యాదాతలు, కళాశాల యాజమాన్యం

## విద్యాదాతలకు ఘన సత్కారం

**పెనమలూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి):** సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా పీవీపీ సిద్ధార్థ కళాశాలలో ఇప్పటివరకు 2004 మంది విద్యార్థులకు రూ. రూ. 4.60కోట్ల ఉపకారవేతనాలు అందజేసిన విద్యాదాతలను గురువారం కళాశాల ప్రాంగణంలో ఘనంగా సత్కరించారు. విద్యార్థులు నాణ్యమైన విద్యను పొందడంలో ఉపకారవేతనాలు ఎంతో సహాయపడుతుందని అకాడమీ కార్యదర్శి పీ లక్ష్మణరావు తెలిపారు. విద్యార్థులకు తమ సాయాన్ని మున్ముందు కూడా అందించి తమ మద్దతు కొనసాగించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ శివాజీబాబు కోరారు. నార్త్ సౌత్ ఫౌండేషన్ సూరపనేని వెంకటరత్నం, ఎం శ్రీలత, మాంటిస్సోరీ పూర్వ విద్యార్థుల ఛారిటబుల్ ట్రస్టు వీ రంగప్రసాద్, తెలుగు పీపుల్ ఫౌండేషన్ వీ రామకృష్ణ, బీ లవకుశ, కోనేరు ఛారిటబుల్ ట్రస్టు కే భీమేశ్వరరావు, కే నరేంద్రబాబు, వైవీ ఛారిటబుల్ ట్రస్టు కే రవిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌వోడీ వి.లక్ష్మి, కోఆర్డినేటర్ ఉషారాణి, తులసి, శ్రీవిజయ, దేవికారాణి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుకు రక్షణగా గ్రామస్థులు



నూతనంగా నిర్మించిన రహదారికి రక్షణగా గ్రామస్థులు

**కంకిపాడు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):** కంకిపాడు - గొడవర్రు - రొయ్యూరు ప్రధాన రహదారిని అభివృద్ధి చేసేందుకు రూ. 3.75 కోట్లతో ప్రభుత్వం రొడ్డు నిర్మాణ పనులను చేపట్టింది. శంకుస్థాపన చేసిన నాటి నుంచి నేటి వరకు రహదారి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. నిర్మాణంలో ఉన్న రహదారిపై వాహనదారులు ఇష్టానుసారంగా రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్డు నిర్మాణ పనులకు ఆటంకం ఏర్పడుతుందని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు బీటీ రోడ్డు, మరో వైపు సీసీ రోడ్డు వేస్తున్నారు. దీంతో ఈ రోడ్డుపై వాహనదారులు రాకపోకలు సాగించేందుకు వీల్లేకుండా టీడీపీ సీనియర్ నాయకులు బోసు, తెలుగుయువత మండల అధ్యక్షులు కోనేరు రాజేష్‌తో పాటు పలువురు గ్రామస్థులు రహదారి రక్షణగా నిలిచారు. వాహనదారులు సహకరించాలని వారు కోరారు.

## వేంకటేశ్వరస్వామి వార్షిక శాంతి కల్యాణ మహోత్సవం 9న

**ఉంగుటూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):** మానికొండలో పద్మావతీ ఆండాళ్ సహిత వేంకటేశ్వరస్వామి 25వ వార్షిక శాంతి కళ్యాణ మహోత్సవం ఈనెల 9వతేదీ ఆదివారం ఉదయం 9గంటలకు ఆలయకమిటీపెద్దలు, గ్రామస్థుల సమక్షంలో నిర్వహించేందుకు అన్నిఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ కమిటీ ప్రెసిడెంట్, సెక్రటరీలు ఆరికట్ల రవికుమార్, కోమటి వెంకటేశ్వర్లు తెలిపారు. 8వతేదీ శనివారం ఉదయం 5గంటలకు సుప్రభాతసేవ, 6గంటలకు నిత్యార్చన, 10గంటలకు స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించనున్నామన్నారు. అనంతరం భక్తులకు స్వామివారి తీర్థప్రసాదములు అందజేస్తామన్నారు. 9వతేదీ ఉదయం 5గంటలకు సుప్రభాతసేవ, 6గంటలకు తులసీదళములతో స్వామికి అర్చన, 9గంటలకు స్వామి శాంతి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నామన్నారు. మధ్యాహ్నం 12గంటలనుంచి అన్నసంతర్పణ కార్యక్రమం జరుగుతుందన్నారు. సాయంత్రం 4గంటలనుంచి గ్రామపురవీధులలో స్వామివారి ఉత్సవమూర్తుల ఊరేగింపు కన్నులపండువుగా సాగుతుందని వివరించారు.

## విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

**పెనమలూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి):** కానూరు, తాడిగడప గ్రామాల్లోని శ్రీరాంనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడరులో మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి పది గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని గుణదల డివిజన్ డీఈ హరిబాబు తెలిపారు. తాడిగడపలోని వసంతనగర్ కట్ట, శ్రీనివాసనగర్ కట్ట, లిమ్రా కాలనీ ప్రజలు సహకరించాలని కోరారు.

## నైపుణ్యంతోనే కొలువులు సాధ్యం: శివ ముకుటమ్

**ప్రసాదంపాడు, మార్చి 6(ఆంధ్రజ్యోతి):** విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలని, నైపుణ్యం ఉన్న వారే పెద్ద పెద్ద కంపెనీల్లో కొలువులు సాధిస్తున్నారని గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఐటీ కన్సల్‌టెంట్ ప్రిన్సిపాల్. అహల్యా ఫౌండేషన్ ఫౌండర్ శివ ముకుటమ్ పేర్కొన్నారు. ఎనికేపాడులోని విజయ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారంసావిషేకర్-2025 రెండో రోజు టెక్ ఫెస్టను నిర్వహించారు. పేపర్ ప్రజంటేషన్, టెక్నాలజీ, బగ్ హంటర్ వంటి పోటీలను నిర్వహించారు. ఉమ్మడి కృష్ణాజిల్లా యూత్ సర్వీసెస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఏపీ సీఈవో ఉప్పలపాటి శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపాల్ తూమాటి వెంకటేశ్వరరావు, కో ఆర్డినేటర్ వై. విజయ, విభాగాధిపతులు పి. సుబ్బయ్య, వి. రాఘవ లక్ష్మి, టి. విష్ణుప్రియ, కె.మురళి, జి. మధుశ్రీ, విద్యార్థినీలు పాల్గొన్నారు.



అహల్యా ఫౌండేషన్ ఫౌండర్ శివ ముకుటమ్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ తూమాటి వెంకటేశ్వరరావు

### పోలీసుల విధులపై అవగాహన కల్పించడమే

## ఓపెన్‌హౌస్ లక్ష్యం

**హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి):** పోలీసుల విధులు, మహిళా సహాయకేంద్రం పనితీరు, విధి నిర్వహణలో ఉపయోగించే సాంకేతికతపై విద్యార్థులకు అవగాహన కల్పించడమే ఓపెన్‌హౌస్ లక్ష్యమని ఎస్సై శ్రీనివాస్ అన్నారు. వీరవల్లి పోలీస్‌స్టేషన్‌లో గురువారం నిర్వహించిన ఓపెన్‌హౌస్ కార్యక్రమానికి హైస్కూల్ విద్యార్థులు, యువతను ఆహ్వానించి అవగాహన కల్పించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయడంతో పాటు వారితో వీహెచ్‌ఎఫ్ సెట్‌లో మాట్లాడించారు. చిన్నారులు, మహిళల రక్షణకు రూపొందించిన చట్టాలపై అవగాహన కల్పించారు. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, గుడ్‌టచ్.. బ్యాడ్ టచ్, ఫోక్సో చట్టం, సైబర్ నేరాల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. విద్యార్థినులు, మహిళలు, చిన్నారులు ఎక్కడైనా ఎప్పుడైనా ఇబ్బందికర పరిస్థితుల్లో ఉంటే తక్షణ సహాయకచర్యగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన హెల్ప్‌లైన్ నెంబరు 100, 112 నంబర్లకు కాల్ చేయాలని సూచించారు. పోలీసులు శాంతిభద్రతలు కాపాడేందుకు వాడే పరికరాలు, ఆయుధాల గురించి విద్యార్థి దశలోనే అవగాహన కల్పించేందుకు ఓపెన్‌హౌస్ ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొని ఆసక్తిగా తిలకించారు.

## క్షయ వ్యాధిపై అవగాహన తప్పనిసరి


**పెనమలూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి):** ప్రతి ఒక్కరూ క్షయ వ్యాధిపై అవగాహన కలగి ఉండాలని డాక్టర్ బిజిలీ శ్రీనివాస్ పేర్కొన్నారు. పెనమలూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు గ్రామ ఒకటో సచివాలయ పరిధిలో క్షయ వ్యాధిపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర్వ్యసనాలతో వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోయిన వ్యక్తులు దగ్గు, జ్వరాలతో బాధ పడుతుంటారన్నారు. ఎవరికైనా ఆకలి మందగించడం, బరువు తగ్గిపోవడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యాధికారులను సంప్రదించి క్షయ వ్యాధి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఇతరులకు అంటువ్యాధిలా సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాజు, జీవీ శ్రీనివాసరావు, హెల్త్ సూపర్‌వైజర్ పురుషోత్తమరాజు, టీబీ సూపర్‌వైజర్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

## పీ-4 సర్వే పై శిక్షణ నేడు

**హనుమాన్‌జంక్షన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి):** స్వర్ణాంధ్ర- 2047 లక్ష్య సాధలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం దిశానిర్దేశం చేసిన పీ-4 సర్వే కార్యక్రమంపై శుక్రవారం బాపులపాడు మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో టి.త్రినాథరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 3.30గంటలకు జరిగే శిక్షణా కార్యక్రమానికి పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పకుండా హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

# పంట ఎండిపోతోంది..!

## ఏటూరు, కంచల మేజర్ల ఆయకట్టు రైతుల ఆక్రోశం



తెలంగాణా సీఈ రమేష్‌బాబుతో మాట్లాడుతున్న రైతులు



తెలంగాణ అధికారులు నాగార్జున సాగర్ నీటిని నిలిపివేయడంతో ఎన్టీఆర్ జిల్లాలో ఎన్ఎస్ఎల్‌బీసీ జోన్-2, జోన్-3 పరిధిలో పంటలు నిలువునా ఎండిపోతున్నాయి. న్యాయంగా రావల్సిన నీటి కోసం ఈ ప్రాంత ఎమ్మెల్యేలు చేస్తున్న ప్రయత్నాలు తెలంగాణ అధికారులను కదిలించలేకపోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి తెలంగాణ ప్రభుత్వ పెద్దలతో మాట్లాడాల్సి ఉంది. రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన నీటిని సాధించి రైతుల్ని ఆదుకోవాల్సి ఉంది. - ఆంధ్రజ్యోతి, కంచికచర్ల

- సాగర్ నీటి నిలిపివేతతో ఎన్ఎస్ఎల్‌బీసీ జోన్లపై ఎఫెక్ట్!
- అన్నదాతలను ప్రభుత్వం ఆదుకోవాలి

నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ జోన్-2కు తెలంగాణలోని చెరువు మాధవరం ట్యాంక్ నుంచి ఏటా 13.5 టీఎంసీల నీరు విడుదల కావాల్సి ఉంది. జోన్-3కు ప్రాజెక్ట్ నుంచి నేరుగా 18 టీఎంసీల నీరు అందాలి. వైసీపీ హయంలో అప్పటి పాలకుల నిర్లక్ష్యంతో ఐదేళ్ల పాటు అడిగే వారు లేకనీటిని ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో జోన్-2, జోన్-3 కింద రైతులు వాణిజ్య, ఆహార పంటల సాగు చేపట్టారు. జోన్-2కు విడతల వారీగా ఇప్పటికి 9.5 టీఎంసీల నీటిని మాత్రమే విడుదల చేశారు. అందులో ఇటీవల వచ్చిన వరద నీటిని కూడా తెలంగాణ అధికారులు లెక్క కట్టినట్టు ఆరోపణలున్నాయి. ఏదేమైనా తొలి విడత కొంత నీటిని అందుకొని సాగు చేపట్టిన రైతులు మలి విడత నీటి కోసం వేచి చూస్తున్నారు. రైతుల ఆందోళన, స్థానిక అధికారుల ఒత్తిడితో కంటి తుడుపుచర్యగా సీఎం ట్యాంక్ నుంచి ఇటీవల కొద్ది మోతాదులో నీటిని విడుదల చేశారు. ఆ నీటిని ఎగువన ఉన్న గండ్రాయి, శనగపాడు-1, శనగపాడు-2, మేజర్ల ఆయకట్టు రైతులు దిగువకు రానివ్వకుండా వాడుకున్నారు. ఫలితంగా కంచల, ఏటూరు మేజర్ల ఆయకట్టు రైతులకు నీరందలేదు. దీంతో ఇక్కడి రైతులు ఆందోళనలకు సిద్ధమయ్యారు. స్పందించిన అధికారులు ఎగువనున్న మేజర్ కాలువలకు నీటిని ఆపి దిగువనున్న కంచల, ఏటూరుకు పంపేందుకు సిద్ధయ్యారు. ఈ క్రమంలో తెలంగాణ అధికారులు సీఎం ట్యాంక్ నుంచి నీటి విడుదల నిలిపేశారు. సీఎం ట్యాంక్‌లో నీటి మట్టం తగ్గినందున ఆపేశామని ఖమ్మం నీటిపారుదల శాఖ అధికారులు చెప్పుకొస్తున్నారు.కంట్రోల్స్ మొత్తం వారి చేతుల్లోనే ఉండడంతో ఇక్కడి రైతులను మోసం చేస్తున్నారు. సాగర్‌లో నీరు పుష్కలంగా ఉన్నప్పుడు సీఎం ట్యాంక్‌కు నీటిని నింపాలని స్థానిక అధికారులు కోరగా సాగర్ నుంచి పాలేరు రిజర్వాయర్‌కు, అక్కడ నుంచి సీఎం ట్యాంక్‌కు నీరు రావల్సి ఉందని, పాలేరు రిజర్వాయర్‌కు తరచూ గండ్లు పడుతున్నందున సాగర్ నీరు విడుదల చేయలేకపోతున్నట్టు తెలంగాణ అధికారులు కుంటు సాకులు చెప్పుకొస్తున్నారు. జోన్-2కు పాలేరు గండ్లను కారణంగా చూపి నీటిని నిలిపేసిన తెలంగాణ అధికారులు జోన్-3 గురించి ఏం చెపుతారంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. రిజర్వాయర్లతో సంబంధం లేకుండా 21 ఎంబీసీ (మధిర బ్రాంచ్ కెనాల్) నుంచి నేరుగా నీరు ఇవ్వాల్సి ఉన్నా ఎందుకు ఇవ్వలేకపోయారంటూ రైతులు మండిపడుతున్నారు.

### రాజకీయ విభేదాలతో సమస్య

తెలంగాణలో ఏర్పడిన రాజకీయ విభేదాలతోనే నీటి విడుదలకు అక్కడి అధికారులు వెనుకాడుతున్నట్టు అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఆంధ్ర ప్రాంతానికి అధిక నీటిని ఇచ్చి తెలంగాణకు అన్యాయం చేస్తున్నారంటూ అక్కడి ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల కారణంగా ప్రభుత్వం నీటిని నిలిపేసి ఉండొచ్చని అనుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి వాటా ప్రకారం రావల్సిన నీటిని తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

### ఏటూరు, కంచల మేజర్ల ఆయకట్టు రైతుల ఆక్రోశం

ఎత్తిపోతల పథకాలు మరమ్మతులకు గురి కావడంతో పూర్తిగా సాగర్ నీటిపై ఆధారపడిన ఏటూరు, కంచల మేజర్ల ఆయకట్టులో పంటలు పూర్తిగా ఎండిపోయే స్థితికి చేరుకున్నాయి. తెలంగాణ అధికారుల నిర్లక్ష్యం, ఎగువ రైతుల స్వార్థంతో సాగునీరందక అల్లాడుతున్న ఇక్కడి రైతులు ఆందోళనలకు సిద్ధమౌతున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి సాగుచేస్తున్న తమ పంటలకు కనీసం నెలాఖరు వరకైనా నీటిని ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఈక్రమంలో ఎన్ఎస్‌పీ నందిగామ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ రాటకొండ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రైతులు సోమవారం ఖమ్మం సీఈ రమేష్‌బాబును కలిసి నీటిని విడుదల చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఆయన ఇది తన పరిధిలో అంశం కాదని, రెండు ప్రభుత్వాల ఉన్నతాధికారులు సంప్రదింపులు జరపాలని చెప్పారు. కృష్ణా రివర్ బోర్డు సమావేశం జరుగుతున్నందున తుది నిర్ణయం కోసం వేచి చూస్తున్నట్టు సీఈ చెప్పారని రైతులు తెలిపారు. ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు స్పందించి తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

## కల్లుగీత కార్మికులకు మద్యం షాపుల కేటాయింపు



ఎన్టీఆర్ కలెక్టరేట్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా గీత కులాలకు సంబంధించిన మద్యం దుకాణాల కేటాయింపును విజయవాడ రూరల్, గొల్లపూడి బీసీ భవన్‌లో కలెక్టర్ లక్ష్మీశ ఆధ్వర్యంలో గురువారం లాటరీ ద్వారా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో 11 మద్యం దుకాణాలకు 335 దరఖాస్తులు వచ్చాయి. లాటరీ ప్రక్రియ ద్వారా 11 మద్యం దుకాణాలను దరఖాస్తుదారులకు కేటాయించారు. 11 మద్యం దుకాణాలకు ప్రొవిజినల్ లైసెన్స్ జారీ చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఎక్సైజ్ అధికారులు టి.శ్రీనివాసరావు, ఎస్.శ్రీనివాసరావు, రామశివ, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆహ్లాదకరమైన జీవనానికి క్రీడలు దోహదం

- ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివారెడ్డి

గాంధీనగర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మహిళా ఉద్యోగుల మానసిక ధైర్యం, ఆహ్లాదకరమైన జీవనానికి క్రీడలు ఎంతగానో తోడ్పడతాయని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు కే వీ శివారెడ్డి తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎన్జీవో సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు నిర్వహించిన పలు సాంస్కృతిక, ఆటల పోటీలు ముగిశాయి. దీనిలో భాగంగా గాంధీనగర్‌లోని ఎన్జీవోహోంలో పాటలు, నృత్య ప్రదర్శన పోటీలు గురువారం జరిగాయి. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ మూడు రోజులు నిర్వహించిన ఈ పోటీల్లో మహిళా ఉద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొనడంపై హర్షం వ్యక్తం చేశారు. విజేతలకు ఈ నెల 8న బహుతుల ప్రదానోత్సవం జరుగుతుందన్నారు.



నృత్య ప్రదర్శన చేస్తున్న ఉద్యోగి



సదస్సులో మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి మురళీధరన్

## దేశమంతా ఒకేసారి ఎన్నికలతో మేలు

- కేంద్ర మాజీ మంత్రి మురళీధరన్

పటమట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఒన్ నేషన్ ఒన్ ఎలక్షన్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కేంద్ర మాజీ మంత్రి మురళీధరన్ అన్నారు. విజయవాడ స్టెల్లా కళాశాల ఆడిటోరియంలో గురువారం ఒన్ నేషన్ ఒన్ ఎలక్షన్ అనే అంశంపై జరిగిన సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో భారత్ శక్తివంతమైన దేశమని ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఐదో స్థానంలో ఉందన్నారు. కొవిడ్ సమయంలో అభివృద్ధి చెందిన దేశాలు సైతం వ్యాక్సిన్ కోసం ఇబ్బందులు పడితే ఇండియా వాటికి వ్యాక్సిన్ అందించిందన్నారు. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో దేశం అభివృద్ధి పథంలో ముందుకు పోతుందన్నారు. మాటిమాటికీ ఎన్నికలు నిర్వహించడం కోడ్ అమలులో ఉండటంతో సంక్షేమ పథకాలు అమలుకు ఇబ్బంది కలుగుతుందన్నారు. దీనివల్ల ఖర్చుతో పాటు సమయం కూడా వృథా అవుతుందన్నారు. తక్షశిల దుర్గా ప్రసాద్, స్టెల్లా కళాశాల ప్రిన్సిపల్ జసింతా క్వాడ్రస్, సూర్యనారాయణ, వల్లూరి జయప్రకాష్ నారాయణ, రమేష్ నాయుడు, విష్ణువర్ధన్ రెడ్డి, సయ్యద్ బాషా పాల్గొన్నారు.




వాడుకలోకి వచ్చిన వాటర్ ప్లాంట్, దాతలు ఏర్పాటు చేసిన మంచినీటితో దాహం తీర్చుకుంటున్న రోగుల బంధువులు

## దాతల సాయం.. తీరిన దాహం..!

- ప్రభుత్వాసుపత్రిలో తాత్కాలికంగా తాగునీటిని ఏర్పాటు చేసిన అధికారులు, దాతలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ప్రభుత్వాసుపత్రి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో తాగునీటి సమస్య అధికంగా ఉండటంతో రోగులు, కుటుంబ సభ్యులు తాగునీటి ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించి ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు శిథిలావస్థలో ఉన్న వాటర్‌ప్లాంట్‌కు మరమ్మతులు చేయించి తాగునీటిని అందించారు. దీనితో పాటు సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌కు వచ్చే రోగులకు కూడా ప్రత్యేకంగా వాటర్ క్యాన్స్ ఏర్పాటు చేసినట్టు సూపరింటెండెంట్ డాక్టర్ ఏవీ రావు తెలిపారు. అన్ని బ్లాక్స్‌లో తాగునీరు ఏర్పాటు చేసి ఎవ్వరికీ ఇబ్బంది లేకుండా చూస్తున్నామన్నారు. హైదరాబాద్‌కు చెందిన వసుధ ఫౌండేషన్ నిర్వాహకులు వాటర్ కూలర్స్‌ను బహూకరిస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. త్వరలో వాటిని ఏర్పాటు చేసి చల్లటి నీటిని అందిస్తామన్నారు. అదనపు కుళాయిని ఏర్పాటు ప్రతిపాదించినట్టు చెప్పారు.

# బ్యూటిఫుల్.. బెజవాడ..!

## విజయవాడ నగర సమగ్రాభివృద్ధికి సత్వర డీపీఆర్‌లు

- విస్తృత ప్రజాప్రయోజన మౌలిక వసతుల పనులపై ప్రత్యేక దృష్టి
- రహదారుల విస్తరణ, సుందరీకరణ పనులకు ప్రాధాన్యత
- అభివృద్ధి పనులకు అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ రహదారులు
- కాలువగట్ల సుందరీకరణ, వాకింగ్ ట్రాక్‌లు, ఫుడ్‌కోర్టుల ఏర్పాటుకూ చర్యలు
- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖర్‌బాబు

కలెక్టరేట్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వాహ్.. బెజవాడ అనిపించేలా నగర సుందరీకరణతో కూడిన అభివృద్ధికి అడుగులు ముందుకు పడ్డాయి. నగరాన్ని మరింత అందంగా తీర్చిదిద్దేందుకు చేపట్టాల్సిన సత్వర ప్రాజెక్టులపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్, జంక్షన్ల సుందరీకరణ, కొండలపై ట్రెకింగ్, వాటర్ ఫౌంటెయిన్స్, రహదారుల విస్తరణ, వాక్‌వేల ఏర్పాటు, పార్కుల అభివృద్ధికి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపకల్పనకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. నగరాన్ని పట్టిపీడిస్తున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి, శ్రీకారం చుట్టారు. అలాగే నగరానికి మణిహారంగా మారనున్న మహానాడు ఫ్లై ఓవర్, విజయవాడ మెట్రో ప్రాజెక్టులపైనా చర్చించారు. రాజధాని అమరావతికి ముఖద్వారంగా ఉన్న బెజవాడ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గురువారం ఎంపీ కేశినేని శివనాథ్ అధ్యక్షతన కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు, కమిషనర్ ధ్యానచంద్రతో కలిసి రహదారులు, భవనాలు, వీఎంసీ, రెవెన్యూ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. విజయవాడ తూర్పు, పశ్చిమ, మధ్య నియోజకవర్గాల పరిధిలో భవిష్యత్తులో చేపట్టాల్సిన పనులపై చర్చించారు. మహానాడు రోడ్డు నుంచి నిడమానూరు వరకు ఫ్లై ఓవర్‌తో పాటు తొలిదశలో గన్నవరం నుంచి మెట్రో కారిడార్ పనులు పూర్తయితే విజయవాడ శరవేగంగా అభివృద్ధి చెందనున్న నేపథ్యంలో ఆ పనులు పూర్తయ్యేలోపు ఎవరికీ ఇబ్బంది లేకుండా అభివృద్ధి చేయాల్సిన ప్రత్యామ్నాయ మార్గాలపై మ్యాపుల ఆధారంగా చర్చించారు.



అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్, చిత్రంలో కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు, వివిధ శాఖల అధికారులు

### సుందరమైన నగరం కోసం..

కృష్ణాతీరం వెంబడి రివర్‌బండ్, హిల్స్ రెయిలింగ్, కాళేశ్వరరావు మార్కెట్ జంక్షన్ సుందరీకరణ, గాంధీ హిల్ అభివృద్ధి, కేదారేశ్వరపేట-టన్నెల్ రహదారి విస్తరణ, చిట్టినగర్ జంక్షన్, వాటర్ ఫౌంటేయిన్‌తో సితార్ జంక్షన్, టన్నెల్-గొల్లపూడి 200 అడుగుల రహదారి, కృష్ణలంక కట్ట వంటి సుందరీకరణ పనులు, వాక్‌వేలపై చర్చించారు. వీటి సాధ్యాసాధ్యాలను పరిశీలించి ప్రతిపాదనలు, అంచనాలు, డీపీఆర్‌లు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అర్బన్ డెవలప్‌మెంట్ ఫండ్ (యూడీఎఫ్), పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) ప్రాజెక్టుల ద్వారా నగరాభివృద్ధికి తీసుకోవాల్సిన సత్వర చర్యలపై సమావేశంలో చర్చించారు.

### పార్కుల అభివృద్ధే కీలకం

నగర ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందించేందుకు వీలున్న పార్కులను అభివృద్ధి చేయడంతోపాటు కొత్త పార్కులను అందుబాటులోకి తేవాల్సిన అవసరముందని గుర్తించారు. కెనాల్ వెంబడి చిన్నచిన్న పార్కులను అభివృద్ధి చేసి, హరితమయ వాతావరణంలో ఫుడ్‌కోర్టులు ఏర్పాటు చేస్తే బాగుంటుందన్నారు. మూడు నియోజకవర్గాల పరిధిలో సైక్లోన్ సెంటర్ల ఏర్పాటుపైనా చర్చించారు. ఆర్డీవో కావూరి చైతన్య, వీఎంసీ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, వీఎంసీ సూపరింటెండింగ్ ఇంజినీర్ (ప్రాజెక్టులు) సి.సత్యకుమారి పాల్గొన్నారు.

### ట్రాఫిక్ సమస్యల పరిష్కారంపై..

నగరంలో ట్రాఫిక్ సమస్యల తీవ్రత చాలా ఎక్కువగా ఉంది. ప్రధానంగా ఎన్‌హెచ్-16, ఎన్‌హెచ్-65పై సమస్యలు అన్నీ, ఇన్నీ కావు. బయట నుంచి నగరానికి వచ్చేవారికి నరకం కనిపిస్తోంది. భవిష్యత్తులో ఎలాంటి ట్రాఫిక్ సమస్య ఎదురుకాకుండా ఏర్పాటు చేయాల్సిన పార్కింగ్ స్థలాలు, వంతెనలు, జంక్షన్ల అభివృద్ధి, ప్రత్యామ్నాయ రహదారులు, రహదారుల అనుసంధానంపై చర్చించారు.

## నంద్యాల ఎస్‌డీపీఐ కార్యాలయంలో ఈడీ సోదాలు

నంద్యాల క్రైం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా కేంద్రంలోని ఎస్‌డీపీఐ (సోషల్ డెమొక్రాటిక్ పార్టీ ఆఫ్ ఇండియా) కార్యాలయంలో ఈడీ అధికారులు గురువారం సోదాలు నిర్వహించారు. దాదాపు 5 గంటలపాటు ఎస్‌డీపీఐ కార్యాలయాన్ని ప్రత్యేక పోలీస్ బలగాలతో తమ ఆధీనంలోకి తీసుకున్నారు. హైదరాబాద్ నుంచి వచ్చిన నలుగురు ఈడీ అధికారుల బృందాన్ని ఎస్‌డీపీఐ కార్యకర్తలు ఆఫీస్ తాళాలు తెరవకుండా అడ్డుపడ్డారు. దీంతో నంద్యాల వన్‌టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి తన బృందంతో వారిని వారించి తాళాలు తెరిపించారు. ఈడీ సోదాలు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5:25 వరకు కొనసాగాయి. ఈడీ సోదాల్లో ఎటువంటి ఆధారాలు, డాక్యుమెంట్లు లభించకపోవడంతో ఈడీ బృందం పంచనామా నిర్వహించి వెళ్లిపోయింది. ఈడీ అధికారులు వెళ్లే సమయంలో ఎస్‌డీపీఐ కార్యకర్తలు వారి వాహనాలకు అడ్డుపడి ఈడీకి, బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈడీ సోదాలు కక్షపూరితమని ఎస్‌డీపీఐ నంద్యాల అసెంబ్లీ ఇన్‌చార్జి ఫాజిల్ పేర్కొన్నారు.

## టీటీడీ చైర్మన్ పీఆర్వోనంటూ బురిడీ

- దర్శనం, సేవల పేరిట.. భక్తులను మోసగించిన వ్యక్తి అరెస్ట్

తిరుమల, మార్చి 6(ఆంధ్రజ్యోతి): టీటీడీ చైర్మన్ ఫొటోను వాట్సాప్ డీపీగా పెట్టుకుని, తాను ఆయన పీఆర్వోనని భక్తులు మోసం చేస్తున్న వ్యక్తిని తిరుమల టూటౌన్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. చంద్రగిరికి చెందిన ఫరూక్ అలియాస్ ప్రసాద్ ప్రస్తుతం నెల్లూరు జిల్లా కోవూరులో నివాసం ఉంటున్నాడు. నాలుగు నెలల నుంచి 'తిరుమల సమాచారం' పేరుతో వాట్సాప్ గ్రూపులు ప్రారంభించి దాదాపు 600 మంది భక్తులను వాటిలో చేర్చాడు. తిరుమల శ్రీవారి దర్శనం, సేవలు కావాలంటే తనను సంప్రదించాలని ఆ గ్రూపుల్లో పోస్టులు పెట్టేవాడు. తాను టీటీడీ చైర్మన్ పీఆర్వో అని నమ్మించి తిరుమల దర్శన టికెట్ల సమాచారాన్ని గ్రూపుల్లో షేర్ చేసేవాడు. భక్తులు ఎవరైనా వ్యక్తిగతంగా కాల్ చేసి మాట్లాడితే ఆన్‌లైన్ ద్వారా నగదు తీసుకుని ఆ తర్వాత వారికి సమాధానమిచ్చేవాడు కాదు. ఇలా దాదాపు రూ.80 వేల వరకు వసూలు చేసి మోసగించాడు. భక్తుల ఫిర్యాదుపై స్పందించిన టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు విచారణకు ఆదేశించారు. ఫరూక్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు ఓ సెల్‌ఫోన్, సిమ్ కార్డులు, బ్యాంక్ పుస్తకాలు స్వాధీనం చేసుకుని.. అతన్ని రిమాండుకు పంపారు.

## 'కల్తీ నెయ్యి' నిందితులకు ముగిసిన సిట్ కస్టడీ

తిరుపతి(నేరవిభాగం), మార్చి 6(ఆంధ్రజ్యోతి): కల్తీ నెయ్యి కేసులో ఇద్దరు నిందితులకు మూడు రోజుల సిట్ కస్టడీ ముగిసింది. న్యాయస్థానం ఆదేశాల మేరకు ఈ కేసులో ఏ3 నిందితుడు పొమిల్ జైన్, ఏ5 అపూర్వ వినయ్‌కాంత్ చావడాలను మంగళవారం సిట్ అధికారులు తమ కస్టడీకి తీసుకున్నారు. సిట్ కార్యాలయంలో విశాఖ సీబీఐ డీఐజీ మురళీ రాంబా నేతృత్వంలో అధికారులు వివిధ కోణాల్లో విచారించారు. వారిద్దరి వాంగ్మూలాలను రికార్డు చేశారు. మూడు రోజుల కస్టడీ గడువు ముగియడంతో గురువారం సాయంత్రం వారిని జ్యుడీషియల్ కస్టడీకి అప్పగించారు. మరోవైపు ఏ2 నుంచి ఏ5 నిందితుల బెయిల్ కోసం దాఖలైన పిటిషన్లపై ఈ నెల 10న విచారణ జరగనుంది.

## లభించని భక్తుడి ఆచూకీ!

- అవ్వాచారి కోన లోయలో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు

తిరుమల, మార్చి 6(ఆంధ్రజ్యోతి): అలిపిరి కాలినడక మార్గంలోని అవ్వాచారి కోన లోయలోకి దూకిన వ్యక్తి కోసం భద్రతా సిబ్బంది గురువారం తనిఖీలను కొనసాగించారు. రివర్స్ మోడ్‌లో విధానంలో ఆ వ్యక్తిని సిద్దారెడ్డిగా గుర్తించిన పోలీసులు బుధవారం అతని ఆచూకీ కోసం ప్రయత్నించిన విషయం తెలిసిందే. సిద్దారెడ్డికి చెందిన కీ ప్యాడ్ ఫోన్, ఓ జత దుస్తులను అతని స్నేహితుడు వీరప్ప పోలీసులకు అందజేశాడు. దీంతో పోలీసులు ఆ దుస్తుల ఆధారంగా డ్యాగ్ స్క్వాడ్‌తో గురువారం అవ్వాచారి కోనలోయలో గాలించారు. ఈక్రమంలో పోలీసు జాగిలం కేవలం 30 మీటర్లు మాత్రమే లోపలకు వెళ్లి తిరిగి వెనక్కి వచ్చేసింది. దీంతో రెండో రోజూ ఆ వ్యక్తి గురించి ఎలాంటి ఆధారాలు లభించలేదు.



శంకుస్థాపనలో పాల్గొన్న నారా భువనేశ్వరి, ఎంపీ దంపతులు

## ఎన్టీఆర్ ట్రస్టు భవన నిర్మాణం హర్షణీయం

- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

పటమట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రజాసేవే ధ్యేయంగా తెలుగు రాష్ట్రాల్లో ఎన్టీఆర్ ట్రస్టు ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. విజయవాడ టీచర్స్ కాలనీలో సాయిబాబా గుడి వద్ద ఎన్టీఆర్ ట్రస్టు భవన నిర్మాణానికి గురువారం సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి శంకుస్థాపన చేశారు. ఎంపీ కేశినేని శివనాథ్ దంపతులు పాల్గొని హైదరాబాద్ నుంచి ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలను ఏపీ ప్రజలకు మరింత చేరువ చేసేందుకు విజయవాడలో భవన నిర్మాణం చేపడుతున్నందుకు భువనేశ్వరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. రాజధాని అమరావతి ప్రాంతంలో ఫైగా తన నియోజకవర్గంలో జరగడం సంతోషాన్నిస్తుందన్నారు. పేద విద్యార్థులకు విద్య, వైద్య సదుపాయాలతో పాటు తలసేమియా కేర్ సెంటర్, బ్లడ్ బ్యాంక్ అందుబాటులోకి వస్తాయన్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా నారా భువనేశ్వరి ట్రస్టును విజయవంతంగా నిర్వహిస్తున్నారన్నారు.

## మహిళాభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేయాలి

- కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

గవర్నర్‌పేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో ముఖ్య భూమిక పోషిస్తున్నారని, ఈ అభివృద్ధి మరింతగా కొనసాగాలని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో ఎంబీవీకే, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, సేఫ్, తరుణీతరంగాలు, భారత మహిళా మండలి, జనశిక్షణా సంస్థాన్, స్పృహాప్తి, సమన్విత సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం చిత్రలేఖనం పోటీలు, అభ్యుదయ గీతాలు, కవితల పోటీలు జరిగాయి. చిత్రలేఖనం పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ రాష్ట్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధిలో మహిళల పాత్రే కీలకమన్నారు. సిద్ధార్థ మహిళా కళాశాల రిటైర్డ్ డైరెక్టర్, సేఫ్ ఈసీ సభ్యురాలు డాక్టర్ విజయలక్ష్మీ మాట్లాడుతూ గెలుపు, ఓటములు ముఖ్యం కాదని, ఇలాంటి అవకాశం వచ్చినప్పుడు తప్పనిసరిగా పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవాలని కోరారు. యూఎస్ఏ హెల్త్‌కేర్ ఎకనమిస్ట్ పాలపర్తి ఇంద్రాణి మాట్లాడుతూ మహిళలు తమ ఆరోగ్యాలను నిర్లక్ష్యం చేయకుండా యోగా, మెడిటేషన్ వంటి వాటికి తప్పనిసరిగా సమయం కేటాయించాలని కోరారు. ఎంబీవీకే మేనేజింగ్ కమిటీ సభ్యురాలు కె.స్వరూపరాణి మాట్లాడుతూ యువతలో దాగి ఉన్న సృజనాత్మకతను పెంపొందించేందుకు ఎంబీవీకే ఇతర మహిళా సంస్థలను కలుపుకుని ఈ పోటీలను నిర్వహించిందన్నారు. చిత్రలేఖనం పోటీలు న్యాయనిర్ణేతలుగా వివిధ సంస్థల ప్రతినిధులు రమేష్, గిరిధర్, చిత్రం సుధీర్, పాటల పోటీల న్యాయనిర్ణేతలుగా స్వరలయ ప్రభాకర్, సూర్య కామేశ్వరి, కవితలకు అనిల్ డ్యాని, వడ్లమూడి పద్మ, వైష్ణవి వ్యవహరించారు. ఎంబీవీకే బాధ్యులు పి.విజయ, పావని, గీత, నందిని, సేఫ్ సంస్థ నుంచి ఉషారాజా, శేషు, తరుణీతరంగాలు బాధ్యులు శ్రీదేవి, జనశిక్షణా సంస్థాన్ పూర్ణిమ, వన్‌ఎర్త్ వన్‌లైఫ్ బాధ్యులు లీలాకుమారి, భారత మహిళా మండలి సూర్యకామేశ్వరి, సమన్విత బాధ్యులు వడ్లమూడి పద్మ పాల్గొన్నారు.



చిత్రలేఖనం పోటీలను ప్రారంభించి, ప్రదర్శనను తిలకిస్తున్న కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

**బ్రాయిలర్ ధరలు**

| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్‌బర్డ్ | 105, 114, 125 |
| చికెన్ విత్ స్కిన్ | 200 |
| చికెన్ స్కిన్‌లెస్ | 210 |

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 430



## సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన తప్పనిసరి

కూచిపూడి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తెగుళ్ల నివారణలో రైతులు తీసుకోవాల్సిన చర్యలు, అధిక దిగుబడుల సాధన తదితర చర్యలపై ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డా.డి.సుధారాణి, కె.రేవతిలు రైతులకు అవగాహన కల్పించారు. ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా మొవ్వలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ విద్యార్థులు అనిత, ఉమాదేవి, నిహారిక, స్వాతి, సింధూర, శ్వేతలు రంగవల్లుల రూపంలో గ్రామపటం, గ్రామంలో ఉన్న సౌకర్యాలు గురించి వివరించారు. రైతులు తాతినేని పూర్ణచంద్రరావు, మండవ కోటేశ్వరరావు, వెంకటరావు, వెంకటేశ్వరరావు, వెంకట కృష్ణారావు, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

## డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ విద్యార్థి ప్రతిభ

గుడివాడ, మార్చి 6(ఆంధ్రజ్యోతి) : హోమిబాబా సెంటర్ ఫర్ సైన్స్‌ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో జనవరి 19వ తేదీన విజయవాడలో జరిగిన ఇండియన్ నేషనల్ మ్యాథమేటిక్స్ ఒలింపియాడ్(ఐఎన్ఎంఓ) మూడో దశ పరీక్షల్లో డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ విద్యార్థి ఉజ్వల్‌రామ్ ప్రతిభ కనబరిచాడు. మే 8 నుంచి 31వ తేదీ వరకు చెన్నైలో నిర్వహించే ఇంటర్నేషనల్ మ్యాథమేటిక్స్ ఒలింపియాడ్ ట్రైనింగ్ క్యాంప్‌కు ఎంపికైనట్లు పాఠశాల అకడమిక్ ప్రిన్సిపాల్ యమ్.సత్యారామ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక పాఠశాల ఆవరణలో విద్యార్థి ఉజ్వల్‌రామ్‌ను అభినందించారు. విద్యార్థి ఉజ్వల్ రామ్‌ను పాఠశాల ప్రిన్సిపాల్స్ లక్ష్మీప్రసాద్, కె.జ్యోతి, ఆర్.ప్రశాంతి, రామిరెడ్డి, ఉపాధ్యాయులు, అభినందించారు.



ఉజ్వల్‌రామ్

## నేత్రదానంతో మరొకరికి కంటిచూపు

గుడివాడ, మార్చి 6(ఆంధ్రజ్యోతి) : నేత్రదానంతో మరొకరికి కంటి చూపు వస్తుందని మానవతా స్వచ్ఛంద సంస్థ సభ్యులు దండమూడి సీతారామస్వామి తెలిపారు. మానవతా స్వచ్ఛంద సంస్థ సభ్యులు చందన శ్రీనివాసరావు మాతృమూర్తి సంపూర్ణాదేవి మృతి చెందింది. ఆమె కుటుంబ సభ్యుల అంగీకారంతో గురువారం ఎల్‌వీ ప్రసాద్ ఐ ఆసుపత్రి వైద్య బృందం కార్నియాను సేకరించారు. ఈ సందర్భంగా ఆమె కుటుంబసభ్యులకు సర్టిఫికేట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు గంటా చంద్రశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# కాలుష్య కోరల్లో గంగానమ్మ చెరువు

పామర్రు, మార్చి6 (ఆంధ్రజ్యోతి): పామర్రు పట్టణం నడిబొడ్డున పంచాయతీ అధీనంలో గల గంగానమ్మ చెరువు మానవ తప్పిదాలతో నేడు కాలుష్య భారినపడి నీరు కలుషితంగా మారాయి. చెరువు సమీపంలో ఉన్న మాసం దుకాణాదారులు తమ దుకాణాల్లోని వ్యర్థాలను చెరువులో పడేస్తున్నారు. దీంతో చెరువు తీవ్ర దుర్గంధాన్ని వెదజల్లుతుంది. గతంలో వైసీపీ పాలనలో గ్రామ పంచాయతీ పాలకులు, అధికారులు చెరువును నిర్వీర్యం చేశారనే ఆరోపణలు సర్వత్రా వినవస్తున్నాయి. ఈ చెరువును సుందరీకరణ చేస్తానని మాజీ ఎమ్మెల్యే కైలే అనీల్ ప్రజలకిచ్చిన వాగ్దానం నీటి మీదరాతల్లాగానే నిలిచాయని స్థానికులు వాపోతున్నారు. చెరువు చుట్టూ మాజీ టీడీపీ దివంగత సర్పంచ్ బీఎస్ రెడ్డి ఇనుప తీగతో ఫెన్సింగ్ వేయించారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీ పాలకులుగానీ, అధికారులుగానీ తమకేమీ పట్టనట్టు వ్యవహరించడం సరికాదని గ్రామస్థులు మండిపడుతున్నారు. గ్రామాల్లో చెరువుల పరిరక్షించే బాధ్యత గ్రామపంచాయతీ అధికారులదేనని, జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటి) స్పష్టంచేసిన సంగతిని పరిగణలోకి తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా ఆ చెరువు పరిరక్షణకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుని పర్యావరణానికి హాని జరగకుండా భవిష్యత్తు అవసరాలకు నీటి వినియోగానికి చర్యలు చేపట్టాలని పలువురు మేధావులు సూచిస్తున్నారు.

**చెరువు పరిరక్షణకు చర్యలు చేపడతాం**

పామర్రు పంచాయతీ అధీనంలో గల గంగానమ్మ చెరువు పరిరక్షణకు తక్షణమే చర్యలు తీసుకుంటాం. వేసవి దృష్ట్యా ముందస్తు చర్యలు చేపడతాం. కాలుష్యం భారినుంచి చెరువును రక్షిస్తాం. భూగర్భ జలాలు కలుషితం కాకుండా చర్యలు చేపడతాం

**సత్యన్నారాయణ ,ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ**



చెత్తా, చెదారాలతో నిండిన గంగానమ్మ మంచినీటి చెరువు



చెరువు నుంచి మోటార్ల ద్వారా నీటి నింపే పైప్‌లైన్

## డిజిటల్ చెల్లింపులపై అవగాహన తప్పనిసరి

పామర్రు,మార్చి6(ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి ఒక్కరూ బ్యాంకు నగదు రహిత లావాదేవీలు(డిజిటల్) చెల్లింపుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని పామర్రు ఎస్‌బీఐ సర్వీసు మేనేజర్ పి.సింధూ అన్నారు. పామర్రు తమ్మాకోటమ్మరెడ్డి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు గురువారం డిజిటల్ లావాదేవీలపట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బ్యాంక్ సేవలను గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ పదవిని యాదవులకు కేటాయించాలి

పామర్రు,మార్చి6(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జరగబోయే ఎమ్మెల్యేలు చేత ఎన్నుకోబడే శాసనమండలి సభ్యుల ఎన్నికల్లో యాదవ కులస్థులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాధాన్యత కల్పించాలని పామర్రు నియోజకవర్గ యాదవసంఘం అధ్యక్షుడు గోరిపర్తి నాగబాబు కోరారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసమావేశంలో యాదవసంఘ నాయకులు సుధాకర్, మూడేశివశంకర్, జొన్నలగడ్డ సురేష్ రామయ్య, పాల్గొన్నారు.

## వృద్ధులకు భోజన వసతి

గుడివాడ, మార్చి 6(ఆంధ్రజ్యోతి) : కీర్తిశేషులు చిన్నాపురం అరుణకుమారి వర్థంతిని పురస్కరించుకుని ఆమె కుటుంబసభ్యులు గురువారం స్థానిక మందపాడులోని నిరాశ్రయుల కేంద్రంలోని వృద్ధులకు రెండు పూటలా భోజన వసతి కల్పించారు. దాతలను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో అరుణకుమారి కుటుంబసభ్యులు, కేంద్రం మేనేజర్ లంకపల్లి పురషోత్తం, వృద్ధులు పాల్గొన్నారు.

# నూతన ఆవిష్కరణల దిశగా విద్యను కొనసాగించాలి

గుడ్లవల్లేరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఫార్మసీ విద్యార్థులు ఫార్మసిస్ట్ ప్రాధాన్యతను గుర్తెరిగి తమ విద్యను నూతన ఆవిష్కరణల దిశగా నిబద్ధతతో కొనసాగించాలని అసోసియేషన్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ప్రొఫిషనల్స్ అధ్యక్షులు ప్రొఫిసర్ రాజీవ్ దహియా పేర్కొన్నారు. గురువారం అసోసియేషన్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ప్రొఫిషినల్స్, గుడ్లవల్లేరు వీవీఐపీఎస్ వారు సంయుక్తంగా నిర్వహించిన ఔషద శస్త్రాలతో ఔషద రూపకల్పన .. భవిషత్ అవకాశాలు అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. తొలుత రాజీవ్ దహియాజ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ప్రొఫిషనల్స్ వారు ఉత్తమ అధ్యాపకులు,విద్యార్థులకు అవార్డులను ప్రధానం చేశారు. అనంతరం విద్యార్థులు, పరిశోధకులకు ఈ-పోస్టర్, జనరల్ ప్రజంటేషన్లు ప్రదర్శించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు ప్రధానం చేశారు. గౌరవాతిధిగా వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సీవీ సురేష్, సదస్సు కన్వీనర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు, రిసోర్స్ పర్సన్ కె.ఎన్.వి.రావు, సదస్సు కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.రవీష, అధ్యాపకులు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న రాజీవ్ దహియా

# గుర్తుతెలియని యువకుడి ఆత్మహత్య

తోట్లవల్లూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : టేకుచెట్టుకి గర్తు తెలియని యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చాగంటిపాడు శివారు కళ్లంవారిపాలెం లంకలో చోటుచేసుకుంది. శుక్రవారం ఉదయం పొలం పనుల నిమిత్తం వచ్చిన రైతులు చెట్టుకు వేలాడుతున్న శవాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్సై సీహెచ్ అవినాష్ , వీఆర్వో బాలకోటయ్య సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందికి దింపించి పరిశీలించారు. పొట్టిదిబ్బలంక, పరిసర ప్రాంత రైతులు, ప్రజలు వచ్చి మృతి చెందిన వ్యక్తిది ఈ ప్రాతం కాదని తేల్చారు. మృతుని శరీరంపై పచ్చబొట్లతో రాయించిన పేర్లు ఉన్నాయి. ఛాతీపై పోలమ్మ, కాజల్, బసవమ్మ పేర్లు రాసి ఉన్నాయి. కుడిచేతిపై నాయక్, ప్రేమకావాలి, కాజల్, అమ్మ, నాన్న, గంగ నే పేర్లు రాసి ఉన్నాయి. ఎడమచేతిపై బ్రూసిలీ అని పేర్లు రాయించుకోవటాన్ని పోలీసులు గమనించారు. మృతుని వయస్సు 30 సంవత్సరాలు ఉంటుందన్నారు. అంతకుమించి మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని ఎస్సై తెలిపారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఉయ్యూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బయటి ప్రాంతం నుండి వచ్చి ఇక్కడ అత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని భావిస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతుని శరీరంపై ఉన్న పేర్లు ఆధారంగా బంధువులు గుర్తిస్తే తోట్లవల్లూరు పోలీస్‌స్టేషన్‌కు రావాలని, 9440627050 నెంబరును సంప్రదించవచ్చని ఎస్సై తెలిపారు.

# క్యాంపస్ ఎంపికల్లో పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో రాజశేఖర్

గుడ్లవల్లేరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన విమానసంస్థ జీఈ ఏరోస్పేస్ వారు నిర్వహించిన క్యాంపస్ ఎంపికల్లో గుడ్లవల్లేరు ఎ.ఎ.ఎన్.ఎం అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్ పాలిటెక్నిక్ విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు పొందారని పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ నిమ్మగడ్డ రాజశేఖర్ తెలిపారు. సంవత్సరానికి రెండులక్షల వేతనంతో తమ మెకానికల్ విద్యార్థులు పి.మహేష్, ఆర్.తనుష్, పి.ఐ.ఎస్.మెహర్, యు.సత్యనారాయణలు ఉద్యోగ అవకాశాలను దక్కించుకున్నారన్నారు. విశ్వవ్యాప్తంగా వాణిజ్య, సైనిక, వ్యాపార, సాధారణ విమానాల కోసం జెట్, టర్బోప్రాప్ ఇంజన్ల తయారీ సంస్థ జీఈ ఏరోస్పేస్ కంపెనీ అని ఇందులో పాలిటెక్నిక్ డిప్లమో నుంచి కొలువులు సాధించడం అంటే చిన్న విషయం కాదని రాజశేఖర్ అన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మ్మెంట్ అధికారి, ఎలక్ట్రికల్ విభాగాధిపతి అయిన ఎం.వి నయ్ , మెకానికల్ విభాగాధిపతి ఎస్ న రేష్‌లను యాజమాన్యం ఛైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, సెక్రటరీ వల్లూరుపల్లి సత్యనారాయణరావు, సహకార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ, ప్రిన్సిపాల్‌లు అభినందించారు.

# సమస్యలను పరిష్కరించాలని ఆశాల ధర్నా



నిరసన తెలుపుతున్న ఆశావర్కర్లు

గుడివాడ, మార్చి 6(ఆంధ్రజ్యోతి) : ఆశావర్కర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌సీపీ రెడ్డి హెచ్చరించారు. గురువారం స్థానిక ప్రాంతీయ ప్రభుత్వాసుపత్రి సమీపంలో ఆశా వర్కర్ల అక్రమ గృహ నిర్భంధాలకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలో పాల్గొనకుండా ఆశావర్కర్లను గృహ నిర్బంధం చేయడం దారుణమన్నారు. మహిళలనీ చూడకుండా పోలీసులను పంపి నిర్బంధించడాన్ని ఖండిస్తున్నామన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు రేపాని కొండ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## తడి, పొడి చెత్తపై అవగాహన తప్పనిసరి

కూచిపూడి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కూచిపూడి గ్రామంలో తడి, పొడి చెత్తపై గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామస్థులకు అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తను ఇళ్ల వద్ద వేర్వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. దీనివల్ల గ్రామాలు పరిశుభ్రంగా ఉండటమే కాకుండా పంచాయతీకి ఆదాయం లభిస్తుందన్నారు. గ్రామ సర్పంచ్ కొండవీటి విజయలక్ష్మి, గ్రామపంచాయతీ కార్యదర్శి పుష్పనాథం, వీరంకి తులసీదాస్, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

# నాలుగో రోజుకు గంగానమ్మతల్లి జాతర

పామర్రు, మార్చి6(ఆంధ్రజ్యోతి): గ్రామదేవతగా కీర్తింపబడిన పామర్రు గంగానమ్మతల్లి జాతర మహోత్సవం గురువారం నాలుగోరోజుకు చేరుకుంది. వేకువజామునే ఆలయం నుంచి బయలుదేరిన అమ్మవారిఘటం, పోతురాజుగెడల సంచార యాత్ర పూర్వపు మునసబు వారసుల ఇంటి వద్ద తొలి నైవేద్యం స్వీకరించారు. అనంతరం అమ్మవారి ఘటం ,పోతురాజుగెడలను డప్పు వాయిద్యాలు, మేళాతాళాల మ .ధ్య యువత ఉత్సాహంతో చిందులేస్తూ కోలాహలంగా సంచారయాత్ర ముందుకు సాగింది. స్థానిక వెలమపేట, కొబ్బరితోట, ఎన్టీఆర్ కాలనీ, బందరురోడ్డు, శ్రీనగర్ కాలనీ, అరండల్‌పేటలో ప్రతి ఇంటికీ వెళ్లి భక్తులు చల్దినైవెద్యాలను స్వీకరించారు. మొక్కులున్నవారు పసుపు,వేపాకు కలిపిన నీటిని వారబోసి, పసుపు కుంకమలతో పోతురాజుగెడల కింద ఓలలాడారు. పూనకాలు వచ్చిన మహిళలకు పంబలవారు నిమ్మకాయ, కొబ్బరి టెంకాయలను కొట్టి వాళ్లను శాంతపరిచారు. ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



అమ్మవారి సంచారయాత్రలో పాల్గొన్న భక్తులు



ఎమ్మెల్సీ ఆలపాటితో మాట్లాడుతున్న రావి

## ఎమ్మెల్సీ ఆలపాటికి రావి అభినందనలు

గుడివాడ, మార్చి 6(ఆంధ్రజ్యోతి) : ఇటీవల జరిగిన ఉమ్మడి కృష్ణా,గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు అభినందనలు తెలిపారు. గురువారం తెనాలిలోని ఆయన స్వగృహంలో ఆలపాటిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



రేషన్ పంపిణీ చేస్తున్న అధికారులు

## దండిగానపూడిలో రేషన్ పంపిణీ

నందివాడ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నందివాడ మంమడలంలో దండిగానపూడిలో రేషన్ పంపిణీ జరగలేదని గురువారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. గురువారం సాయంత్రం ఆర్ఐ గణేష్, వీఆర్వో శేఖర్, సివిల్ సప్లయాస్ డీటీ కిరణ్ కుమార్, రేషన్ డీలర్‌తో రేషన్ తీసుకొచ్చి గ్రామస్థులకు పంపిణీ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ రేషన్ వస్తుందో రాదో అన్న అనుమానంతో ఉన్న గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు

# మినుముకు గిట్టుబాటు ధర కల్పించాలి



మినప పంట పరిశీలిస్తున్న నారాయణరావు

కూచిపూడి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మినుము పంటకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కృష్ణా జిల్లా కౌలు రైతు సంఘం సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు డిమాండ్ చేశారు. గతేడాది క్వింటా మినుము ధర 9 వేలు ఉండగా, ఈ ఏడాది 8 వేలు లోపు మాత్రమే ఉందన్నారు. రైతులు ఇప్పటికీ ఎకరాకు 30 వేల వరకు పెట్టుబడులు పెట్టి ఉన్నారని, గిట్టుబాటు ధర లేకపోవటం వల్ల రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదముందన్నారు. మిర్చి ధరలు గిట్టుబాటు లేకపోవటం, మరో ప్రక్క మినుము పంట నూర్పిడిలు ముమ్మరంగా ప్రారంభమైన నేపథ్యంలో రైతులు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని నారాయణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మొవ్వ మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి రైతుల కష్టనష్టాలు అడిగి తెలుసుకున్నారు.

## ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

గుడివాడ రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏజీకే పాఠశాల విద్యార్థులకు గుడివాడ రూరల్ పోలీస్ స్టేషన్‌ను గురువారం అవగాహన కోసం తరలివెళ్లారు. విద్యార్థులకు తుపాకీ ఏ విధంగా ఉపయోగించాలి, ప్రమాదాలు జరిగితే ఏ విధంగా తప్పుకోవాలి తదితర అంశాలపై ఎస్సై చంటిబాబు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతీ విద్యార్థి ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కేసు ఏ విధంగా నమోదు చేస్తామనే అంశాలపై ఏజీకే పాఠశాల విద్యార్థులకు వివరించారు.

పెదపారుపూడి: పెదపారుపూడి ఏఎస్ఐ ప్రకాశరావు విద్యార్థులకు పోలీస్ స్టేషన్ గురించి అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు పోలీసుల పట్ల అవగాహన కల్పించటమే కాకుండా, వారిలో భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే మంచి పౌరులుగా ఎలా ఉండాలనే అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసులు ,సిబ్బంది పాల్గొన్నారు.

# పవన్ కల్యాణ్‌ను విమర్శించే అర్హత జగన్‌కు లేదు : నరేష్

పామర్రు, మార్చి6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రజలకు సంక్షేమం, అభివృద్ధి సమానంగా పంచుతున్న జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను విమర్శించే నైతిక హక్కు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి లేదని పామర్రు నియోజకవర్గ జనసేనపార్టీ సమన్వయకర్త తాడిశెట్టి నరేష్ పేర్కొన్నారు. స్థానిక జనసేనపార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తక్షణమే పవన్ కల్యాణ్‌పై చేసిన ఆరోపణలపై క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈసమావేశంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి అంబటి రాజ్యలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షులు గుంప గంగాధర్,పాల్గొన్నారు.

గుడివాడ: రాష్ట్ర ప్రజలు ఛీత్కరించి ఘోర ఓటమిని రుచి చూపించినా వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిలో మార్పు రాలేదని జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ హెచ్చరించారు. గురువారం స్థానిక నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మజ్జి శ్రీనివాసరావు, దుర్గారావు, షేక్ షరీఫ్, రాజేష్, వెంకట్రావు, వినోద్ పాల్గొన్నారు.

ఐదేళ్ల రాష్ట్రాన్ని రావణకాష్టంగా మార్చి అడ్డగోలు దోపిడీలకు పాల్పడి, ప్రతిపక్ష హోదాకు సైతం దూరమైన మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి మతిభ్రమించి పిచ్చివాగుడు వాగుతున్నాడని జనసేన జిల్లా నాయకులు సందు పవన్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక ఆంజనేయపేటలోని ఆయన వ్యక్తిగత కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వద్దే గిరి, జనసేన నాయకులు గంగాధర్, జగన్, సుభాషిణి, పాల్గొన్నారు.

**బ్రాయిలర్ ధరలు**



| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 105, 114, 125 |
| చికెన్ విత్ స్కిన్ | 200 |
| చికెన్ స్కిన్‌లెస్ | 210 |

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.410

10లోగా ఆస్తిపన్ను చెల్లించకపోతే

## విద్యుత్ కనెక్షన్ల తొలగింపు

**మచిలీపట్నం టౌన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి):** నగర పాలక సంస్థ పరిధిలోని ఇళ్ల స్థలాలు, ఖాళీ స్థలాలకు పన్నుల బకాయిలు ఈనెల 10వ తేదీలోగా చెల్లించాలని కమిషనర్ బాపిరాజు తెలిపారు. చెల్లించని వారి ఇళ్లకు కరెంటు కనెక్షన్లు తొలగిస్తామని హెచ్చరించారు.

## కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు

**మచిలీపట్నం టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):** నగర పాలక సంస్థలో గురువారమూ ఆక్రమణల తొలగింపు కొనసాగింది. మునిసిపల్ కమిషనర్ బాపిరాజు ఆధ్వర్యంలో బస్టాండ్ నుంచి లక్ష్మీటాకీసు సెంటర్ వరకు యంత్రాల సాయంతో ఆక్రమణలు తొలగించారు. మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



ముస్లింలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ

## అల్లా మార్గం అనుసరణీయం

**మచిలీపట్నం టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):** అల్లా బోధించిన ప్రేమ మార్గం అనుసరణీయమని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఇనకుదురుపేట గాడిఖానాలో బార్ ఇమామ్ జైనుల్ అబ్దీన్ పంజాలో రంజాన్ సందర్భంగా ముస్లింలకు బాబుల్ ఐఎంఎల్‌ఎం వెల్ఫేర్ ట్రస్టు ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులను ఆయన పంపిణీ చేశారు. గతంలో టీడీపీ ప్రభుత్వం హయాంలో పేదలకు రంజాన్ తోఫా, మక్కా మదీనా యాత్రకు ఆర్థిక సాయం అందించామన్నారు. వైసీపీ ప్రభుత్వం ఈ పథకాలను నిర్వీర్యం చేసిందన్నారు. తిరిగి వాటిని పునరుద్ధరిస్తామని మంత్రి తెలిపారు. నియోజకవర్గంలో దర్గాల ఆధునీకరణకు నిధులు మంజూరు చేస్తామన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ పాల్గొన్నారు.

## పొడి, తడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి

**మచిలీపట్నం టౌన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి):** ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని పారిశుధ్య సిబ్బందికి కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. బందరు మండలం రుద్రవరం గ్రామంలో గురువారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా తడి, పొడి చెత్త వేరు చేసే విధానాన్ని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సేకరించిన చెత్తను కుప్పగా పోసి తడి, పొడి చెత్తను ఎలా వేరు చేయాలో పారిశుధ్య సిబ్బంది చూపించారు. తడి చెత్తను స్థానికంగా ఉండే చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల(సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్)కు తరలించాలన్నారు.



రుద్రవరంలో పారిశుధ్య సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ బాలాజీ

## ఆలయ అభివృద్ధికి రూ.50 వేలు విరాళం

**ఘంటసాల, మార్చి 6(ఆంధ్రజ్యోతి):** భద్రావతి సమేత భావనారుషి స్వామి దేవాలయం ముఖ మండపానికి స్టీల్ గ్రిల్స్ ఏర్పాటు చేయటానికి అందె లీలాకృష్ణ- శారదాదేవి దంపతులు రూ.50 వేలు విరాళమిచ్చారు. గురువారం ఆలయ చైర్మన్ అందె జగదీష్‌కు నగదును అందజేశారు.

# భగ్గుమన్న భానుడు

● నిర్మానుష్యంగా ప్రధాన రహదారులు

**మచిలీపట్నం టౌన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి):** నగరంలో గురువారం సూరీడు భగ్గుమన్నాడు. నిత్యం రద్దీగా ఉండే లక్ష్మీటాకీసు సెంటర్, రేవతి సెంటర్, కోనేరుసెంటర్ నిర్మానుష్యంగా మారాయి. వృద్ధులు, పిల్లలు వేడిగాలులకు తల్లడిల్లారు. భవన నిర్మాణ కార్మికులు, వివిధ వృత్తుల పనులవారు ఎండలో పనిచేసేందుకు విలవిలలాడారు. నగరానికి వివిధ పనులపై వచ్చినవారంతా దప్పిక దీర్చుకునేందుకు అందుబాటులో ఉన్న శీతల పానీయాలు తాగి దాహార్తిని దీర్చుకున్నారు.



నిర్మానుష్యంగా ఉన్న లక్ష్మీటాకీసు సెంటర్

## మామిడితోట గ్రామంలో అగ్ని ప్రమాదం

ఒక గృహం, నాలుగు చావిళ్లు, రెండు గడ్డి వాములు దగ్ధం..రూ.5.35 లక్షల ఆస్తి నష్టం

**ఘంటసాల, మార్చి 6(ఆంధ్రజ్యోతి):** మల్లాయిచిట్టూరు పంచాయతీ పరిధిలోని మామిడితోట గ్రామంలో గురువారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం జరిగింది. విద్యుత్ వైర్ల నుంచి పడిన నిప్పు రవ్వలు ఎండిన ఆకులపై పడటంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమీపంలో ఉన్న ఒక గృహానికి, దాని పక్కనే ఉన్న నాలుగు పశువుల చావిళ్లకు మంటలు వ్యాపించాయి. స్థానికులు మచిలీపట్నం అగ్నిమాపక శాఖాధికారులకు సమాచారం అందించారు. వారు వచ్చి మంటలు అదుపు చేశారు. లోయ చిన్న శ్రీనివాసరావుకు చెందిన నాలుగు దూలాల ఇల్లు, 2 ఎకరాల గడ్డివాము దగ్ధం కాగా, రూ.3 లక్షల నష్టం వాటిల్లింది. లోయ కాశీరత్నానికి చెందిన రెండు పశువుల పాకలు, ఐదు ఎకరాల గడ్డి వామి దగ్ధం కాగా రూ.1.50 లక్షల నష్టం, లోయ సుబ్బమ్మ పశువుల చావిడి కాలిపోగా రూ.50 వేలు నష్టం, లోయ బేబీ సరోజిని పశువుల చావిడి దగ్ధం కాగా, రూ.35 వేలు నష్టం జరిగినట్లు అగ్నిమాపక శాఖాధికారులు తెలిపారు. మొత్తం రూ.5.35 లక్షల నష్టం వాటిల్లిందని అగ్నిమాపక అధికారులు తెలియజేశారు.

## గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

**మచిలీపట్నం టౌన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి):** మూడు స్తంభాల సెంటర్ సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానం సమీపంలో జయమ్మ అనే వృద్ధురాలి ఇంట్లో గురువారం గ్యాస్ సిలిండరు పేలి భారీగా మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో ఇంట్లో సామాను మొత్తం కాలిపోయాయి. కూలి పనులు చేసుకుని జీవించే జయమ్మ కట్టుబట్టలతో మిగిలింది.

## ఉపాధి పనిదినాల పెంపుతో వ్యవసాయ కూలీలకు మేలు

**మచిలీపట్నం టౌన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి):** ఉపాధి హామీ పనిదినాలు 150 రోజులకు పెంచడం వల్ల వ్యవసాయ కూలీలకు చేతి నిండా పని దొరుకుతుందని తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ అన్నారు. గురువారం బందరు మండలం కానూరు గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. కార్మికులతో కలిసి ఆయన పనిచేశారు. కరువు మండలాల్లో మార్చి నెలాఖరులోగా అదనంగా 50 పనిదినాలు ఉపయోగించుకోవచ్చన్నారు. గతంలో రూ.270 ఉన్న వేతనాన్ని కూటమి ప్రభుత్వం రూ.300కు పెంచిందన్నారు. దివి మహేష్, పీతా రాము, బొమ్మిడి ఏడుకొండలు, వంకా కాశీ, కొక్కిలిగడ్డ ప్రభుదాస్, మోపిదేవి కృష్ణ పాల్గొన్నారు.



కానూరులో కార్మికులతో కలిసి ఉపాధి పనులు చేస్తున్న తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ

## ఆలపాటిని గెలిపించినందుకు పట్టభద్రులకు కృతజ్ఞతలు

● బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు

**పెడన, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):** కూటమి ప్రభుత్వం పట్ల విద్యావంతులైన పట్టభద్రులకు ఉన్న విశ్వసనీయతకు ఎమ్మెల్సీగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపే నిదర్శనమని బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు అన్నారు. ఆలపాటికి ఘన విజయం చేకూర్చిపెట్టిన పట్టభద్రులకు పార్టీ తరఫున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తోటమూలలోని టీడీపీ కార్యాలయంలో నాయకులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మరో ఏడాదిలో మునిసిపల్ ఎన్నికలు జరగనున్నందున నాయకులు ఇప్పటి నుంచే పట్టణంలోని అన్ని వార్డులపైన ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. బీసీ, ఎస్సీ, రుణాలకు అర్హులైన అభ్యర్థుల దరఖాస్తులు వార్డు సచివాలయాలకు అందేలా చూడాలన్నారు. యక్కల శ్యామలయ్య, వహబ్‌ఖాన్, అబ్దుల్ ఖయూం, హమీదుల్లా, బెజవాడ నాగరాజు, నాగపోతరావు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సును ఢీకొన్న టాటా ఏస్

● టాటా ఏస్ డ్రైవర్ దుర్మరణం.. అందులో ప్రయాణిస్తున్న ఆరుగురికి గాయాలు





ఆర్టీసీ బస్సును వెనుక నుంచి ఢీకొన్న టాటా ఏస్ వాహనం, మృతుడు బొల్లా మోహనరావు

**గూడూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):** మచిలీపట్నం - విజయవాడ జాతీయ రహదారిపై చిట్టిగూడూరు వద్ద గురువారం విజయవాడ నుంచి బందరు వస్తున్న ఆర్టీసీ ప్యాసింజర్ బస్సును వెనుక నుంచి టాటా ఏస్ వాహనం ఢీకొట్టిన ఘటనలో టాటా ఏస్ డ్రైవర్, టీడీపీ ఆకుమర్రు గ్రామ అధ్యక్షుడిగా బొల్లా మోహనరావు మృతి చెందాడు. మోహనరావు రోజూ ప్రయాణికులను ఎక్కించుకుని విజయవాడ సర్వీస్ చేస్తుంటాడు. బస్సును వెనుక నుంచి ఢీకొట్టడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతిచెందాడు. టాటా ఏస్ వాహనంలో ప్రయాణిస్తున్న ఆరుగు గాయపడటంతో చికిత్స నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్సై కె.ఎన్.వి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కృష్ణానదిలో దూకి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

**కోడూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి):** కృష్ణానదిలోకి దూకి వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన అంబటి బ్రాహ్మణయ్య వారధి వద్ద గురువారం జరిగింది. ఎస్సై చాణక్య తెలిపిన వివరాల ప్రకారం.. రామకృష్ణాపురం గ్రామానికి చెందిన తాడికొండ సత్యనారాయణ(57) వారధి పైనుంచి గురువారం కృష్ణానదిలో దూకాడు. అదే సమయంలో నదిలో వేటాడుతున్న మత్స్యకారులు అతడిని సురక్షితంగా బయటకు తీసి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే 108 వాహనంలో అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్సై చాణక్య తెలిపారు.



మాట్లాడుతున్న కొల్లు నీలిమ, పక్కన లంకిశెట్టి నీరజ తదితరులు

## అన్ని రంగాల్లోనూ రాణిస్తున్న మహిళలు

**మచిలీపట్నం టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):** మహిళలు లేకుండా ఏ రంగం పురోగతి సాధించలేదని, ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాల్లోనూ సమర్థవంతంగా రాణిస్తున్నారని మంత్రి కొల్లు రవీంద్ర సతీమణి కొల్లు నీలిమ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉదయపు నడక మిత్ర మండలి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో నీలిమ మాట్లాడారు. ఉదయపు నడక మిత్ర మండలి మహిళా విభాగం అధ్యక్షురాలు లంకిశెట్టి నీరజ, జల్లు మురళీనాథ్, మహాలక్ష్మి, కారుమూరి రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు. ప్రముఖ గాయని సింగరాజు కల్యాణిని సత్కరించారు.

## నాంచారమ్మ జాతర వైభవంగా నిర్వహిద్దాం

● అధికారులంతా సమన్వయంతో పనిచేయండి

● సమీక్షా సమావేశంలో తహసీల్దార్ శ్రీను నాయక్

**కోడూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):** విశ్వనాథపల్లిలో ఈనెల 13, 14 తేదీల్లో నిర్వహించే అద్దంకి నాంచారమ్మ జాతరను వైభవంగా నిర్వహించడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని తహసీల్దార్ శ్రీను నాయక్ కోరారు. జాతర నిర్వహణపై మండలంలోని వివిధ శాఖల అధికారులతో తహసీల్దార్ అధ్యక్షతన ఆలయ ఈవో జయశ్రీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధాన రహదారికిరువైపులా ఉన్న ఆక్రమణలు, ముళ్లచెట్లు తొలగించాలని, కృష్ణానది తీరాన పుణ్యస్నానాలు భక్తులు ఆచరించేందుకు ఘాట్ల వద్ద ప్రత్యేక ఫెన్సింగ్ వేయాలని, భక్తులు దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. 200 మందితో బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్సై చాణక్య తెలిపారు. జాతరకు వచ్చే వాహనాలు విశ్వనాథపల్లి మీదుగా నరసింహాపురం నుంచి కోడూరు వెళ్లాలని ఎస్సై సూచించారు. అయితే విశ్వనాథపల్లి-కోడూరు రహదారి అధ్వానంగా ఉందని ఆ రోడ్డుపై ఎలా ప్రయాణిస్తారని గ్రామస్థుడు తోట లక్ష్మణరావు ప్రశ్నించారు. మండల పరిషత్ నిధులతో విశ్వనాథపల్లి-కోడూరు రహదారి మరమ్మతులకు రూ.లక్ష నిధులు కేటాయిస్తున్నట్లు ఈవోపీఆర్డీ నాగరేవతి తెలిపారు. విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు, ఆర్ఐ సుభాషిణి, సర్పంచ్ కొప్పనాతి శేషుబాబు పాల్గొన్నారు.



# డిప్యూటీ సీఎం పవన్‌పై జగన్‌వి చిల్లర మాటలు

● వెంటనే పవన్‌కు క్షమాపణ చెప్పాలి..జగన్ ఫొటోలు దహనం చేసిన కూటమి నేతలు

**అవనిగడ్డ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):** ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చిల్లరతనంగా మాట్లాడారని, వెంటనే క్షమాపణ చెప్పాలని టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు డిమాండ్ చేశారు. అవనిగడ్డలో గురువారం వారు నిరసన ప్రదర్శన చేపట్టి జగన్ ఫొటోలను దహనం చేశారు. క్షమాపణ చెప్పకుంటే తమ సత్తా చూపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు కొల్లూరి వెంకటేశ్వరరావు, మత్తి వెంకటేశ్వరరావు, బండే రాఘవ, గుడివాక శేషుబాబు, మాచవరపు ఆదినారాయణ, రాయపూడి వేణుగోపాలరావు, బొప్పన భాను, రాజనాల వీరబాబు, పరుచూరి దుర్గా ప్రసాద్, బచ్చు రఘునాథ్, అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ, షేక్ బాబావలి, సింహాద్రి పవన్, మండలి రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



అవనిగడ్డలో జగన్ ఫొటోలు దహనం చేస్తున్న కూటమి నాయకులు

## జగన్‌రెడ్డీ హుందాగా మాట్లాడడం నేర్చుకో..

● తండ్రి శవం పక్కన సంతకాలు చేయించిన చరిత్ర నీది: గొర్రెపాటి గోపీచంద్

**మచిలీపట్నం టౌన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి):** తండ్రి శవం పక్కన పెట్టుకుని తాను ముఖ్యమంత్రి అవడం కోసం సంతకాలు చేయించిన చరిత్ర జగన్‌రెడ్డిది అని, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై ఆయన వ్యాఖ్యలు సరికాదని హుందాగా మాట్లాడడం నేర్చుకోవాలని టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ హితవు పలికారు. శిడింబి అగ్రహారంలో తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలే జగన్‌రెడ్డికి ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని, వైనాట్ 175 అంటే 11 స్థానాలకే పరిమితం చేశారని, ఇది తెలుసుకోకుండా జగన్‌రెడ్డి ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని గోపీచంద్ విమర్శించారు.

## జైలుకు ఎక్కువ బెయిల్‌కు తక్కువ

● జగన్‌కు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ కౌంటర్

**మచిలీపట్నం టౌన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి):** కార్పొరేటర్‌కు ఎక్కువ ఎమ్మెల్యేకు తక్కువ అంటూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి మాజీ సీఎం జగన్మోహనరెడ్డి చేసిన వ్యాఖ్యలకు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ కౌంటర్ ఇచ్చారు. జగన్..నువ్వు జైలుకు ఎక్కువ బెయిల్‌కు తక్కువ అంటూ ఎద్దేవా చేశారు. గురువారం పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దివంగత సీఎం రాజశేఖరరెడ్డి కుమారుడు కాకపోతే కార్పొరేటర్‌గా కూడా గెలిచే స్థాయి జగన్‌కు లేదన్నారు. 151 సీట్లు ఇచ్చి ముఖ్యమంత్రిని చేస్తే జగన్, వైసీపీ నాయకుల ప్రవర్తించిన తీరు చూసి ప్రజలు ఛీకొట్టారని, అందుకే 11 సీట్లు ఇచ్చారని విమర్శించారు. నోటి దురదతో ఇష్టానుసారంగా మాట్లాడిన వైసీపీ నాయకులు జైలుకు వెళుతున్నారన్నారు. ఇప్పటికైనా జగన్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకోకపోతే రానున్న ఎన్నికల్లో 11 సీట్లు కూడా రావన్నారు. నాయకులు గడ్డం రాజు, మాదివాడ రాము, వంపుగడల చౌదరి, కొట్టె వెంకట్రావు, కార్పొరేటర్ పినిశెట్టి చాయాదేవి, వేణు, కుమారి, కర్రి మహేష్ పాల్గొన్నారు.



కోడూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

## జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేయండి

**కోడూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి):** ఈనెల 12న పిఠాపురం నియోజకవర్గం చిత్రాడలో జరుగుతున్న తొలి ఆవిర్భావ సభను మండల పరిధిలోని జనసైనికులు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం కోడూరులో పార్టీ కార్యాలయం వద్ద మర్రే గంగయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, మండలి వెంకట్రామ్, మత్తి వెంకటేశ్వరరావు, కొండవీటి సునీత, ఉల్లి శేషగిరిరావు పాల్గొన్నారు.




పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జనసేన నాయకులు బండి రామకృష్ణ, గడ్డం రాజు, మాదివాడ రాము తదితరులు

## పోస్టర్ల ఆవిష్కరణ

**మచిలీపట్నం టౌన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి):** ఈనెల 12న పిఠాపురంలో నిర్వహించే జనసేన ఆవిర్భావ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ పిలుపునిచ్చారు. ఆవిర్భావ సభ వాల్‌పోస్టర్లను ఈ సందర్భంగా ఆవిష్కరించారు.

# యువత సామాజిక బాధ్యతతో మెలగాలి



మాట్లాడుతున్న మాజీ ఉపకులపతి రామకృష్ణారావు

**మచిలీపట్నం టౌన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి):** యువత సామాజిక బాధ్యతతో మెలగాలని కృష్ణా విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి, జాతీయ కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు రామకృష్ణారావు సూచించారు. గురువారం కేయూలో ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో విద్యార్థులతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆస్తుల రక్షణకు ప్రజలు సహకరించాలని, ఈనెల 15,16 తేదీల్లో గుంటూరులో జరగనున్న యూత్ పార్లమెంటులో పాల్గొనేందుకు యువత సన్నద్ధం కావాలని ఉపకులపతి రాంజీ పిలుపునిచ్చారు. రిజిస్ట్రార్ ఉష, డీన్ వై.కె.సుందరకృష్ణ, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమార్, ఎన్ఎస్ఎస్ విభాగం సమన్వయకర్త ఎన్. శ్రావణి తదితరులు మాట్లాడారు.

### కేయూ ఫస్ట్ సెమిస్టర్ ఫలితాల్లో 59.65 శాతం ఉత్తీర్ణత

కృష్ణా విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ కళాశాలల్లో మొదటి సెమిస్టర్ ఫలితాలను ఉపకులపతి కె.రాంజీ ప్రకటించారు. 7212 మంది పరీక్షలకు హాజరు కాగా 4302 మంది ఉత్తీర్ణులయ్యారు. 59.65 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు పరీక్షల నియంత్రణ అధికారి బ్రహ్మచారి తెలిపారు.

## చేపలు, రొయ్యలతో విలువ ఆధారిత ఉత్పత్తులు

**మోపిదేవి, మార్చి 6(ఆంధ్రజ్యోతి):** మహిళలు ఇంటి వద్దనే ఉంటూ మత్స్య పదార్థాలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారు చేసి, స్వయం ఉపాధి పొందొచ్చని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి సూచించారు. మెరకనపల్లి పంచాయతీ శివారు చిరువోలులో చేపలు, రొయ్యలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మత్స్యశాస్త్రవేత్త జె.యశ్వంత్ కుమార్ చేపల ద్వారా తయారు చేసిన ఆహార పదార్థాలను ప్రదర్శనా పూర్వకంగా వివరించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు కృష్ణవేణి, రేవతి, పలువురు మహిళలు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం

**నాగాయలంక, మార్చి 6(ఆంధ్రజ్యోతి):** ఏటిమొగకు చెందిన డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థిని మద్దుల లావణ్య చదువు కోసం వాసవీ సేవాదళ్ నేతలు రూ.25 వేలు విరాళాలు సేకరించారు. గురువారం చిట్టా శేఖర్ నేతృత్వంలో విద్యార్థినికి అందజేశారు.

# వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ

**అవనిగడ్డ రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):** వేకనూరులో గురువారం రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల శాంతి కల్యాణాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పూజలు చేశారు. 8 వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. జనసేన నాయకులు మండలి వెంకట్రామ్, గుడివాక శేషుబాబు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

### స్వతంత్రపురంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

**కోడూరు:** స్వతంత్రపురంలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా నిర్వహించారు. గురువారం మువ్వ ఉషాద్రిపతి ఆధ్వర్యంలో ఊసా కాశీ రామకృష్ణ- లక్ష్మీ మౌనిక దంపతులతో ప్రత్యేక పూజలు నిర్వహించి, శాస్త్రోక్తంగా విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు.



వేకనూరులో ప్రతిష్ఠించిన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, స్వతంత్రపురంలో ప్రతిష్ఠించిన ఆంజనేయస్వామి విగ్రహాలు

## గ్రామ పంచాయితీ కార్యాలయం - కొక్కిలిగడ్డ

ఆర్.ఓ.సి.నెం. 01/2025 **టెండరు ప్రకటన** తేది. 06-03-2025

కృష్ణాజిల్లా, మోపిదేవి మండలం, కొక్కిలిగడ్డ గ్రామ పంచాయితీ పరిధిలో ఈ దిగువ షెడ్యూల్‌లో చూపిన ప్రకారం కాంట్రాక్ట్ లేబర్ పద్ధతి పై పనిచేయుటకు గాను సీల్డ్ టెండర్లను ది. 13-03-2025వ తేదీన మధ్యాహ్నం గం. 12-30 ని.ల వరకు సదరు పంచాయితీ సెక్రటరీ వారిచే గాని లేక వారి అధికారం పొందిన మరియొకరిచే గాని సీల్డ్ టెండర్లు స్వీకరించబడును. అదే రోజు మధ్యాహ్నం 1-00 గంటకు హాజరైన టెండర్ దార్లు సమక్షమున టెండర్లు తెరవబడును. టెండర్ షెడ్యూల్స్ ది. 10-03-2025వ తేదీన తీసుకొనవలెను. కావున టెండర్లలో పాల్గొనువారు నిర్ణీత ధరావత్తులు చెల్లించి పాల్గొనవలెను.

| వ.నెం. | పని వివరములు | పని కాలము |
|---|---|---|
| 1) | పారిశుధ్య పనుల నిర్వహణకు 1 వ్యక్తి | ది. 01-04-2025 |
| 2) | పి.డబ్ల్యూ స్కీమ్ నిర్వహణకు 1 వ్యక్తి | నుండి |
| 3) | వీధి దీపములు నిర్వహణకు 1 వ్యక్తి | ది.31-03-2026 వరకు |

గమనిక : గతంలో పని చేసినవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. మిగిలిన వివరాలు షరతులు ఆఫీసు పనిచేయు వేళలో తెలుసుకొనవచ్చును.

సం/- వి.రవికుమార్, పంచాయితీ కార్యదర్శి, కొక్కిలిగడ్డ గ్రామ పంచాయితీ